


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 26-01-2026 | సంపుటి - 26 | సంచిక -247 | రూ : 4 | పేజీలు: 8


## రాజ్యాంగమే మనకు మార్గదర్శి..
# రిపబ్లిక్ డే ముంగిట రాష్ట్రపతి ప్రసంగం

- గణతంత్ర దినోత్సవ పూర్వ సంధ్యలో జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి
- న్యాయం, సోదరభావమే గణతంత్రానికి పునాదులని స్పష్టం చేసిన ద్రౌపది ముర్ము
- దేశాభివృద్ధిలో మహిళలు, రైతులు, శాస్త్రవేత్తల పాత్రను కొనియాడిన రాష్ట్రపతి
- అంబేద్కర్ సందేశాన్ని, సాయుధ దళాల శౌర్యాన్ని ప్రత్యేకంగా గుర్తుచేశారు
- రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలే ప్రభుత్వానికి మార్గదర్శకమని ఉద్ఘాటన



2లో



2లో

## త్వరలోనే బీఆర్ఎస్ బ్యాన్..
# కవిత సంచలన వ్యాఖ్యలు

- దళిత ఐఏఎస్‌పై కథనాలు వస్తే ఖండించరా..?
- జర్నలిస్టులకు సపోర్ట్ చేస్తారా?
- ఇదేనా మీ వైఖరి కేటీఆర్..
- సృజన్ రెడ్డిని సాకుగా చూపి
- మేఘా కృష్ణారెడ్డిని కాపాడుతున్నారు..
- నైనీ టెండర్లను రద్దు చేసినట్టే.. ఎండీవోను రద్దు చేయాలి..
- రాష్ట్రం కోరకుండా సీబీఐ వస్తుందా..?
- మీరే మా పార్టీలోకి రండి.. టీ పీసీసీ చీఫ్‌కు ఆహ్వానం
- కేసీఆర్‌కు గుంట నక్క ద్రోహం..
- ఫోన్ ట్యాపింగ్ జోక్..
- మాజీ ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు






## రోహిత్ శర్మకు పద్మశ్రీ..
### హర్మన్ ప్రీత్ కౌర్‌కు కూడా విశిష్ట గౌరవం

- భారత క్రికెటర్లు రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్‌కు పద్మశ్రీ
- టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృతరాజ్‌కు పద్మభూషణ్
- మహిళల హాకీ క్రీడాకారిణి సవిత పూనియాకు పద్మశ్రీ పురస్కారం
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులను ప్రకటించిన కేంద్రం



2లో



2లో

### ప్రపంచంలోనే
## అత్యుత్తమంగా 'భూభారతి'

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రూ.వేల కోట్ల కుంభకోణం ప్రతిపక్షాల ఆరోపణే..
- మంత్రి పొంగులేటి




2లో

## 'మన్ కీ బాత్' లో అనంతపురం గురించి
# ప్రస్తావించిన ప్రధాని మోదీ

- మన్ కీ బాత్ లో అనంతపురం ప్రజల జల సంరక్షణ కృషిని ప్రశంసించిన మోదీ
- 10కి పైగా జలాశయాల పునరుద్ధరణ, 7 వేల మొక్కలు నాటారని అభినందన
- దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని కితాబు

## ఈ బడ్జెట్ సెషన్‌లోనే..
# అమరావతికి రాజముద్ర

- జనవరి 28 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు
- టీడీపీ ఎంపీలతో సీఎం చంద్రబాబు సమావేశం
- అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై దృష్టి సారించాలని సూచన
- పోలవరం, నల్లమల సాగర్, పూర్వోదయ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీలకు స్పష్టం
- వివాదాలకు తావివ్వకుండా రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టులకు అనుమతులు సాధించాలని ఆదేశం



2లో

# పద్మ పురస్కార విజేతలకు సీఎం చంద్రబాబు అభినందనలు

2026 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు శుభాకాంక్షలు చెబుతూ, ముఖ్యంగా 13 మంది తెలుగు వారికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కడం పట్ల ఆయన ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడుకు పద్మభూషణ్ పురస్కారం లభించడం గర్వకారణమని చంద్రబాబు అన్నారు. అదేవిధంగా, పద్మశ్రీ పురస్కారాలు పొందిన వారందరికీ ఆయన పేరుపేరునా శుభాకాంక్షలు తెలియజేశారు. విజేతలలో యూజీసీ మాజీ ఛైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్, సినీ నటులు రాజేంద్రప్రసాద్, మురళీ మోహన్ ఉన్నారు. ఇంకా సైన్స్, ఇంజనీరింగ్ రంగాల్లో కృష్ణమూర్తి బాల సుబ్రహ్మణియన్, గడ్డమనుగు చంద్రమౌళి... వైద్య రంగంలో పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి, గూడూరు వెంకట్రావు... సాహిత్య రంగంలో వెంపటి కుటుంబ శాస్త్రి... నృత్యంలో దీపికారెడ్డిలకు అభినందనలు తెలిపారు. మరణానంతరం పద్మశ్రీ పొందిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (కళలు), రామారెడ్డి మామిడి (పశుసంవర్ధక)ల సేవలను కూడా సీఎం స్మరించుకున్నారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించి తెలుగు జాతి ఖ్యాతిని మరింతగా వెలిగించిన ఈ ప్రముఖుల విజయాలు అందరికీ స్ఫూర్తిదాయకం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## రోహిత్ శర్మకు పద్మశ్రీ...
## హర్మన్ ప్రీత్ కౌర్‌కు కూడా విశిష్ట గౌరవం

భారత క్రికెట్ రంగానికి చెందిన ప్రముఖ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. 2026 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పద్మ అవార్డుల జాబితాను విడుదల చేసింది. ఇందులో భారత పురుషుల జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ లభించింది.క్రీడా రంగం నుంచి మరికొందరు ప్రముఖులు కూడా ఈ ఏడాది పద్మ పురస్కారాలకు ఎంపికయ్యారు. టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృతరాజ్‌కు దేశంలోని మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ దక్కింది. అదేవిధంగా, భారత మహిళల హాకీ జట్టు క్రీడాకారిణి సవిత పూనియాకు కూడా పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించారు. 2026 సంవత్సరానికి గాను మొత్తం 131 పద్మ పురస్కారాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. వీటిలో 5 పద్మవిభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ అవార్డులు ఉన్నాయి. కళలు, సామాజిక సేవ, క్రీడలు, సైన్స్, వాణిజ్యం వంటి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి ఏటా ఈ పురస్కారాలను అందజేస్తారు. ఈసారి క్రీడా రంగానికి చెందిన పలువురికి పద్మ పురస్కారాలు దక్కడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## రేపు సతీసమేతంగా రిపబ్లిక్ డే వేడుకలకు
## హాజరుకానున్న పవన్ కల్యాణ్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన అర్ధాంగి అన్నా కొణిదెల రేపు (జనవరి 26న) రాజధాని అమరావతిలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే అధికారిక కార్యక్రమంలో వారు పాల్గొంటారు. ఈ వేడుకల కోసం పవన్ కల్యాణ్ దంపతులు ఈ రోజు సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అంతకుముందు వారు మహారాష్ట్రలోని నాందేడ్‌లో పర్యటించారు. అక్కడ నిర్వహించిన గురు తేజ్ బహదూర్ షాహిది సమాగమంలో పవన్ కల్యాణ్, అన్నా కొణిదెల పాల్గొన్నారు. ఆ కార్యక్రమాన్ని ముగించుకుని వారు ప్రత్యేక విమానంలో నేరుగా గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. అక్కడి నుంచి అమరావతికి బయలుదేరి వెళ్లారు.

## త్వరలోనే బీఆర్ఎస్ బ్యాన్..
## కవిత సంచలన వ్యాఖ్యలు

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానెల్‌ను బహిష్కరించిన బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏ చానెల్‌ను బ్యాన్ చేయటమేంటో కానీ త్వరలోనే ప్రజలు బీఆర్ఎస్ పార్టీని బ్యాన్ చేస్తారు అని ఆమె అన్నారు. సింగరేణి బొగ్గు గనుల టెండర్ల విషయంలో జరుగుతున్న పరిణామాలపై బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత ఆదివారం మీడియాతో మాట్లాడారు. మన రాష్ట్రంలో ఇప్పుడు దారుణమైన ట్రెండ్ స్టార్ట్ అయ్యింది. మోస్ట్ అన్ పాపులర్ యూట్యూబ్ చానెల్‌లో కథనాలు వేసినట్లు శాటిలైట్ చానెల్‌లో కథనాలు వేస్తున్నారు. దళిత ఐఏఎస్ మీద అలాంటి కథనాలు వేయటంపై మేము ఎంతో బాధపడ్డాం. గతంలో లైన్ అతిక్రమించిన యూట్యూబ్ చానెల్ వాళ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి లైన్ అతిక్రమించిన శాటిలైట్ చానెల్ ప్రతినిధులను కూడా అరెస్ట్ చేసింది. ఐతే జర్నలిస్టులను అరెస్ట్ చేసిన తీరును మేము ఖండిస్తున్నాం. వాళ్లేమీ టెర్రరిస్టులు కాదు. వాళ్లకు నోటీసులు ఇచ్చి వివరణ అడగాల్సింది. ఈ అవకాశాన్ని వినియోగించుకొని బీఆర్ఎస్ పార్టీ జర్నలిస్టులకు సపోర్ట్‌గా నిలిచింది. కానీ కేటీఆర్ మీద ఇలాంటే కథనాలే వస్తే ఆయన అనుచరులు ఒక చానెల్‌పై దాడి చేశారు. అక్కడ మహిళపై కథనాలు వేస్తే దాడి.. ఇక్కడ మహిళలపై కథనాలు వస్తే జర్నలిస్టులకు సపోర్ట్ చేస్తారా? మహిళల విషయంలో ఇదేనా మీ వైఖరి అని నేను కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నా. ఒక దళిత బిడ్డపై కథనాలు వస్తే ఆమెకు అండగా ఉండకపోవటాన్ని ప్రజలు గుర్తించాలి అని కవిత సూచించారు.

* **తిమింగళం కోసం బీఆర్ఎస్ నేతలు ముందుకు..**

ఆ చానెల్‌లో కథనం తర్వాత ఆ కథనం బ్యాక్ గ్రౌండ్ అంటూ ఇంకొక పేపర్‌లో కథనం వచ్చింది. ఆ కథనం ఆధారంగా భట్టి విక్రమార్క ప్రెస్ మీట్ పెట్టారు. భట్టి ప్రెస్ మీట్ పెట్టగానే మా గుంటనక్క కూడా ప్రెస్ మీట్ పెట్టారు. గుంటనక్క ప్రెస్ మీట్‌ను గుడ్డిగా ఫాలో అయి కేటీఆర్ ఒక ప్రెస్ మీట్ పెట్టారు. మొత్తానికి నైనీ టెండర్లు రద్దు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. అయితే ఇక్కడ విచిత్రాలు జరగుతున్నాయి. రెండేళ్లుగా మేము కార్మికుల సమస్యల గురించి ఎన్నిసార్లు మాట్లాడిన భట్టి మాట్లాడలేదు. కార్మికులకు వంద అన్యాయాలు జరిగిన సరే బీఆర్ఎస్ కూడా మాట్లాడలేదు. కానీ ఒక తిమింగళం లాంటి కాంట్రాక్టర్‌కు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ నేతలు ముందుకు వస్తున్నారు అని కవిత పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ నేతలవి అబద్ధాలు..**

2015లో మనకు నైనీ ముందుగా అలాట్ అయ్యింది. 2021లో అదానీ 44 శాతం ఎక్సెస్‌గా టెండర్ వేస్తే ఆయనకు కాంట్రాక్ట్ ఇవ్వలేదు. మధ్యలో సిగంరేణి వేరే కంపెనీ వాళ్లకు మట్టి తీసే టెండర్ ఇచ్చింది. దానికి డీజిల్ ఖర్చులతో సహా ఇచ్చారు. కానీ గుంటనక్క అబద్ధం చెప్పారు. కేటీఆర్ ఏ విషయమైనా అధ్యయనం చేసి మాట్లాడుతారని అనుకునేదాన్ని. కానీ ఆయన మాట్లాడుతుంటే దారుణం అనిపించింది. అసలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్సెస్ టెండర్లు ఇవ్వలేదని అన్నారు. కానీ చాలా టెండర్లను ఎక్సెస్‌కు ఇచ్చారు. 36, 16, 7, 8 శాతం ఎక్సెస్‌కు ఇచ్చారు. కాంగ్రెసోళ్లు ఏం సుద్దపూసలు కాదు.. వారు మొత్తానికే ఎక్సస్ ఇచ్చారు. సైట్ విజిట్ అనే నిబంధన సింగరేణిలో గతంలో కోల్ హ్యాండ్లింగ్ యూనిట్స్, కోల్ వాషర్ యూనిట్స్‌కు, కన్వెయర్ బెల్ట్ లాంటి వాటికి ఉండే. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఓబీకి కూడా సైట్ విజిట్ పెట్టారు. దీన్ని ఎక్స్‌పోజ్ చేయటం మంచిదే. కానీ బీఆర్ఎస్ హయాంలో అసలు ఎక్సెస్‌గా టెండర్లు పోలేదని అబద్ధాలు చెప్పటం సరికాదు అని కవిత మండిపడ్డారు.

* **సృజన్ రెడ్డికి కాంట్రాక్ట్‌లు ఇచ్చిందే గుంట నక్క**

గుంటనక్క, నమస్తే తెలంగాణ, టీ న్యూస్, కేటీఆర్ కలిసి చిన్న చేపను పెద్దగా చూపి పెద్ద చేపను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. సృజన్ రెడ్డి అనే వ్యక్తికి వచ్చింది కేవలం రూ. 250 కోట్ల కాంట్రాక్ట్ మాత్రమే. అతను సీఎం బావమరిది అని ఆయనను పెద్దగా చేసి చూపెట్టి.. రూ. 25 వేల కోట్ల కాంట్రాక్ట్ చేపట్టే మేఘా కృష్ణారెడ్డి గురించి మాట్లాడటం లేదు. అసలు సృజన్ రెడ్డికి కాంట్రాక్ట్‌లు ఇచ్చిందే గుంటనక్క. అప్పుడు సీఎం బావమరిది అని వీళ్లకు తెలియదా? సైట్ విజట్ నిబంధన కారణంగా కొంతమందికి అవకాశాలు దెబ్బతింటాయి. కానీ గుంటనక్క చెప్పని విషయమేమిటంటే సాయిల్ ఎక్స్‌వేషన్ పేరుతో మేఘా కృష్ణారెడ్డి సంస్థ అనుభవం ఉందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా రూ. 25 వేల కోట్ల కాంట్రాక్ట్‌ను పెద్ద చేపకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు అని కవిత ధ్వజమెత్తారు.

## 'మన్ కీ బాత్' లో అనంతపురం గురించి ప్రస్తావించిన ప్రధాని

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ప్రజల కృషిని ప్రత్యేకంగా అభినందించారు. తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నప్పటికీ, అక్కడి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జల సంరక్షణలో చూపిస్తున్న చొరవ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కరవుకు చిరునామాగా మారిన ప్రాంతంలో సామూహిక కృషితో మార్పు తీసుకువస్తూ దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. 2026 సంవత్సరంలో తొలిసారిగా జరిగిన 130వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో ప్రధాని మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా చాలా కాలంగా వర్షాభావ పరిస్థితులతో, నీటి కొరతతో అల్లాడుతోందని గుర్తుచేశారు. ఈ క్లిష్ట పరిస్థితులను అధిగమించడానికి స్థానిక ప్రజలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా, స్వయంగా 'చేతను' అనే కార్యక్రమం ద్వారా జలాశయాల పునరుద్ధరణకు నడుం బిగించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇప్పటివరకు 10కి పైగా చెరువులు, కుంటలను పునరుద్ధరించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణలో భాగంగా 7 వేలకు పైగా మొక్కలను నాటారని మోదీ వివరించారు. కరవు సీమలో పచ్చదనం నింపేందుకు, భూగర్భ జలాలను పెంచేందుకు వారు చేస్తున్న ఈ సామూహిక కృషి దేశానికే ఆదర్శమని ప్రశంసించారు.

## ఈ బడ్జెట్ సెషన్‌లోనే అమరావతికి రాజముద్ర

రాష్ట్రాభివృద్ధిలో పార్లమెంట్ సభ్యుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు, ప్రాజెక్టులు సాధించడం ద్వారా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై గట్టిగా గళం విప్పాలని, తమ నియోజకవర్గాల అభివృద్ధి అవకాశాలు, సమస్యల పరిష్కారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ (టీడీపీపీ) సమావేశం జరిగింది. జనవరి 28 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, కేంద్రంతో జరపాల్సిన సంప్రదింపులపై ఎంపీలకు చంద్రబాబు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో పాటు మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

* **అమరావతికి రాజముద్ర.. ప్రాజెక్టులకు ప్రాధాన్యం**

పార్లమెంట్ సమావేశాల్లోనే రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు ఆమోదముద్ర వేయించడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి కేంద్రంలోని మంత్రులు, అధికారులతో నిరంతరం టచ్‌లో ఉండాలని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధికి వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, పూర్వోదయ పథకం, పోలవరం, నల్లమల సాగర్ ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతాంశాలుగా తీసుకోవాలని అన్నారు. ఫిబ్రవరిలో జరగనున్న కలెక్టర్ల సదస్సులో ఎంపీలందరూ వర్చువల్‌గా పాల్గొని రాష్ట్రంలోని క్షేత్రస్థాయి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలతో సమన్వయం కోసం నియమించిన ఎంపీలు, ఆయా శాఖలకు సంబంధించిన పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని చంద్రబాబు తెలిపారు.

**వివాదాలు వద్దు.. నీళ్లే ముఖ్యం**

నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో పొరుగు రాష్ట్రాలతో వివాదాలు వద్దని, మనకు కావాల్సింది నీళ్లు మాత్రమేనని సీఎం స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన తాజా అంచనాలను కేంద్రానికి సమర్పించామని, ప్రాజెక్టు నిర్మాణం, పునరావాస కార్యక్రమాల కోసం కేంద్రం నుంచి ఇంకా రూ.12,000 కోట్లు రావాల్సి ఉందని సమావేశంలో ప్రస్తావించారు. 2027 జూన్‌లో జరిగే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. నల్లమల సాగర్ ప్రాజెక్టు అంశం పార్లమెంటులో ప్రస్తావనకు వస్తే, రాష్ట్ర వాదనలను బలంగా వినిపించాలన్నారు. తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి మంజీరాకు నీటిని తరలించినప్పుడు ఏపీ అభ్యంతరం చెప్పలేదని, అలాంటిది నల్లమల సాగర్‌కు తెలంగాణ అభ్యంతరం చెప్పడం సరికాదనే విషయాన్ని కేంద్రానికి స్పష్టంగా వివరించాలని ఎంపీలకు సూచించారు.

**నిధుల సమీకరణే లక్ష్యం**

పూర్వోదయ ప్రాజెక్టు కింద రూ.40 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇచ్చాపురం నుంచి తడ వరకు నాలుగు లేన్ల రైల్వే ట్రాక్ సాధించేలా కృషి చేయాలని చంద్రబాబు కోరారు. రైల్వే శాఖ వద్ద భారీగా నిధులు అందుబాటులో ఉన్నాయని, ఫ్లైఓవర్లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతి ఎంపీ తమ నియోజకవర్గంలో అవకాశాలను గుర్తించి, నిధులు సాధించాలని చెప్పారు. పీపీపీ పద్ధతిలో ఆసుపత్రుల నిర్మాణానికి కేంద్రం సిద్ధంగా ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సభలో కానీ, బయట కానీ కూటమి లక్ష్యాలకు భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించవద్దని గట్టిగా హెచ్చరించారు.

**జాతీయ అంశాలపైనా గళం విప్పండి**

రాష్ట్ర అంశాలతో పాటు జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ఎంపీలు అవగాహన పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు. ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టడంలో చొరవ చూపాలని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఎంపీలు తమ పరిధిలోని ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు భారతదేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారని, ఇది రాష్ట్రానికి ఉన్న సానుకూల దృక్పథాన్ని తెలియజేస్తోందని ఎంపీలకు వివరించారు.

## రాజ్యాంగమే మనకు మార్గదర్శి...
## రిపబ్లిక్ డే ముంగిట రాష్ట్రపతి ప్రసంగం

గణతంత్ర దినోత్సవ వేడుకలకు దేశం సిద్ధమవుతున్న వేళ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. న్యాయం, సోదరభావం అనే రెండు కీలకమైన అంశాలను మన రాజ్యాంగం నిర్వచించిందని, అవే గణతంత్రానికి పునాదులని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దార్శనికత, రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. దేశాభివృద్ధి ప్రయాణంలో మహిళలు కీలక మైలురాళ్లను సృష్టిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నారని రాష్ట్రపతి ప్రశంసించారు. దేశ భద్రతకు కాపలా కాస్తున్న సాయుధ బలగాల శౌర్య పరాక్రమాలను కొనియాడుతూ, 'ఆపరేషన్ సిందూర్'ను ఆమె గుర్తుచేశారు. దేశ పురోభివృద్ధికి దోహదపడుతున్న రైతులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, సైనిక, పోలీసు సిబ్బంది, వ్యాపారవేత్తలు, యువత సేవలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేయడానికి ఎన్నికలలో పాల్గొనడం పౌరుల బాధ్యత అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన సందేశాన్ని రాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేశారు. వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలతో పాటు సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లకు నివాళులర్పించిన కార్యక్రమాలను కూడా ఆమె ప్రస్తావించారు. భారత ప్రజాస్వామ్య క్యాలెండర్‌లో అత్యంత ముఖ్యమైన ఈ వార్షిక ప్రసంగం దేశవ్యాప్తంగా కోట్లాది మంది పౌరులకు చేరింది. ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభమైన ఈ ప్రసంగాన్ని ఆకాశవాణి జాతీయ నెట్‌వర్క్‌తో పాటు అన్ని దూరదర్శన్ ఛానెళ్లలో ప్రసారం చేశారు. మొదట హిందీలో, ఆ తర్వాత ఆంగ్లంలో రాష్ట్రపతి ప్రసంగించారు. అనంతరం, దూరదర్శన్ ప్రాంతీయ ఛానెళ్లు వివిధ ప్రాంతీయ భాషలలో ఈ సందేశాన్ని ప్రసారం చేశాయి. దీనివల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు తమ మాతృభాషలో రాష్ట్రపతి సందేశాన్ని వినే అవకాశం కలిగింది. గణతంత్ర భారతదేశం ఆవిర్భవించిన తొలి నాళ్ల నుంచి రాష్ట్రపతి ప్రసంగం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఇది దేశ ప్రగతి, విజయాలు, సవాళ్లను సమీక్షించుకోవడానికి ఒక అవకాశంగా నిలుస్తుంది. 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన చారిత్రక రోజుకు గుర్తుగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆ రోజునే మన దేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్రంగా అవతరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ప్రసంగం, జనవరి 26 వేడుకలకు స్ఫూర్తిదాయకమైన స్వరాన్ని అందిస్తూ, ఐక్యత ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది.

## ప్రపంచంలోనే అత్యుత్తమంగా 'భూభారతి'

''గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిన ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి, ప్రపంచంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దిన భూభారతి చట్టాన్ని మా ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది'' అని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాలో శిక్షణ పూర్తిచేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లు 47 మందికి కలెక్టరేట్‌లో ఆదివారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'ధరణి'లో తప్పులను సవరించి, ఆధార్ కార్డుల్లా భూములకు భూధార్ సంఖ్య కేటాయిస్తామన్నారు. నూతన చట్టంలో భాగంగానే భూముల సమగ్రసర్వేకు 5,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామన్నారు. మిగతా జిల్లాల్లోనూ రెండు, మూడు రోజుల్లో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారన్నారు. గతంలో ధరణిని అడ్డంపెట్టుకుని పాల్పడిన అక్రమాలను వెలికితీసేందుకు కేరళకు చెందిన ఓ సంస్థకు ఫోరెన్సిక్ ఆడిట్ బాధ్యత అప్పగించామన్నారు. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో అందిన నివేదికలను పరిశీలిస్తున్నామని, మిగతా జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. భూభారతి వచ్చాక వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని, అవన్నీ ధరణిలో లొసుగులతోనే చోటుచేసుకున్నాయని, రూ.వేల కోట్ల కుంభకోణం ఏమీలేదని, కేవలం రూ.3.9 కోట్లు దారి మళ్లాయని గుర్తించామన్నారు. జనగామ జిల్లాలో కొన్ని మీసేవా కేంద్రాల్లో జరిగిన అక్రమాలు వెలికితీసి దోషులను అరెస్టు చేసినట్లు వివరించారు.

* **మున్సిపల్ ఎన్నికల్లో పైరవీలకు తావు లేకుండా టికెట్లు**

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాభిప్రాయాన్ని సేకరించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏదులాపురం పురపాలిక ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో మాట్లాడారు.

# గీత కార్మికుల రాత మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికుల రాత మారుస్తుందని, గౌడన్నల సంక్షేమానికి, అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని పలువురు అన్నారు. ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ గ్రామంలో సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ, ఎక్సైజ్ అధికారులు సంతోష్ కుమార్, రఘు, ఉపసర్పంచ్ కోలా కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం గీత కార్మికులకు కాటమయ్య కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కే సమయంలో ప్రమాదాలకు గురి కాకుండా ప్రభుత్వం కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తుందని తెలిపారు. రూ.15 వేల విలువైన కిట్లు అందించటంతోపాటు వాడకంపై ట్రైనింగ్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. వీటిని వాడుతున్న గౌడన్నలు సౌకర్యవంతంగా ఉన్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఇప్పటి వరకు పోతుగల్‌లో 34 కాటమయ్య కిట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బాదవేణి శ్రీనివాస్ గౌడ్, వార్డు మెంబర్ చేపూరి శ్రీనివాస్, వాల్మీకి, జోష్ణ, సంతోష్, ఆన్‌ఆర్ఐ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, గౌడ సంఘం నాయకులు వంగ రాములు, జిల్లెల్ల రాజయ్య, సతీష్, అంజయ్య, శ్రీధర్ తదితరులున్నారు.

# నైనిక రజువాను సత్కరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర బొగ్గుగనుల శాఖా మంత్రి కిషన్ రెడ్డికి ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా మొక్కను అందించింది. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోగల కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన భారతీయ జనతాపార్టీ ఎన్నికల విజయ సంకల్ప సభకు కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు రంగాకిరణ్ సహకారంతో నైనిక రజువా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మొక్కను అందచేసి, ప్రకృతి పరిరక్షణ కోసం హరితదీక్ష వ్యవస్థాపకులు,మన్ కీ బాత్ లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ చే ప్రసంశలు లందుకున్న మొక్కల రాజశేఖర్ ఆధ్వర్యంలో తాను చేస్తున్న కృషిని మంత్రికి తెలియజేసింది. ఈ సందర్భంగా నైనిక రజువా ను కిషన్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను ముమ్మందు మరింత ముమ్మరంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేషన్ ఎన్నికల ఇన్‌చార్జి మార్తినేని ధర్మారావు, సీనియర్ నాయకులు విజయ్ చందర్ రెడ్డి, జివికె. మనోహర్, వాసుదేవరావు, గొడుగు శ్రీధర్, గుంపుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు విలువ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యున్నతమైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా తన ఓటు హక్కును వినియోగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నూతన ఓటర్లతో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఆదివారం కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలే పాలకులను ఎన్నుకునే హక్కే ఓటు హక్కు అని, దీని కోసం గతంలో అనేక త్యాగాలు జరిగాయని గుర్తు చేశారు. యువత, నూతన ఓటర్లు ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించగా, ఓటు ప్రాముఖ్యతను చాటిచెప్పే నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు సాగిన సైకిల్ ర్యాలీలో పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖల అధికారి పరంధామ రెడ్డి, ఎన్నికల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

*** బీఆర్ఎస్ ఎల్ పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బీఆర్ఎస్ ఎల్ పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ శ్రీమాతా యోగ అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో యోగాచార్య పూజ శ్రీ జగన్ గురూజీ ఆధ్వర్యంలో ఆలయ 26 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ ఎల్ పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి బండి రమేష్, కార్పొరేటర్లు రావుల శేషగిరి,కొలుకుల జగన్,మంత్రి సత్యనారాయణ,మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి. దేశాల్ లు ముఖ్య అతిథులుగా హాజరై అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ మాతా యోగా అన్నపూర్ణేశ్వరి అమ్మవారి కరుణ కటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవాలయ కమిటీ సభ్యులు మురళీకృష్ణ, భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, కార్తీక్, చందు, చరణ్, భాను, భవన్,మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు,డివిజన్ అధ్యక్షులు డి.విజయ్ రాంరెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పి.అంజన్ గౌడ్, కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, మక్సూద్, తెలంగాణ సాయి, సుంకరి చందు,దూలప్ప, చిన్నా చౌదరి, పి.రాములు గౌడ్, పి.సమ్మయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## జగద్గిరిగుట్ట సగర ఉప్పర సంఘం
# నూతన సంవత్సర కాలమానం ఆవిష్కరణ

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట సగర ఉప్పర సంఘం కమిటీ సభ్యులు రూపొందించిన 2026వ సంవత్సరం కాలమానాన్ని ఆదివారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆవిష్కరించారు. అనంతరం జగద్గిరిగుట్ట సగర ఉప్పర సంఘం లోని నూతన కమిటీతోపాటు మహిళా సంఘం, యువజన విభాగం సంఘాలకు చెందిన నూతన కమిటీ సభ్యులను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సగర ఉప్పర సంఘం నూతన కమిటీ అధ్యక్షులు వి. సుదర్శన్ సాగర్, ప్రధాన కార్యదర్శి భీమయ్య సాగర్, కోశాధికారి వెంకటరమణ సాగర్, మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ సాగర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి సాగర్, కోశాధికారి లావణ్య సాగర్, యువజన విభాగం అధ్యక్షులు సంపత్ సాగర్, ప్రధాన కార్యదర్శి కిషోర్ సాగర్, కోశాధికారి సుమన్ సాగర్, స్టీరింగ్ కమిటీ చైర్మన్ రాంసాగర్, కన్వీనర్ శ్రీనివాస్ సాగర్, సభ్యులు సత్యనారాయణ సాగర్, కొండయ్య సాగర్, రామకృష్ణ సాగర్, గోపాల్ సాగర్, శ్రీరాములు సాగర్, శ్రీనివాస సాగర్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## చిత్తరమ్మ తల్లిని దర్శించుకున్న
# మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం లోని గాజులరామారంలో గల శ్రీ శ్రీ శ్రీ చిత్తరమ్మ దేవి జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఇందులో భాగంగా ఆదివారం ముఖ్యమైన అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించిన పూజ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. పేదల కొంగుబంగారమైన ఆ చిత్తరమ్మ తల్లి ఆశీస్సులు కృప, కటాక్షాలు, చల్లని దీవెనలు, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరారు, అదేవిధంగా పోలీసు అధికారులు , మున్సిపల్ అధికారులు చేసిన ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను కోరారు, అనంతరం ఆలయ కమిటీ వారు కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు.చిత్తరమ్మ దేవి ఆలయ ప్రాంగణమంతా భారీ సంఖ్యలో భక్తులతో కిటకిటలాడుతుంది, ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకుంటూ,తమ మొక్కులను చెల్లిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, సలహాదారు కూన శ్రీనివాస్ గౌడ్, ఇతర సభ్యులు బాలరాజు, నరసింహ, ఇంద్రసేన గుప్తా, బుచ్చిరెడ్డి, పెంట రెడ్డి, గౌరిశెట్టి శివ, సత్తయ్య ఇంద్రసేనారెడ్డి, స్థానిక డివిజన్ నాయకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా నేరేడ్ మెట్ గ్రామ బొడ్రాయి 11వ వార్షికోత్సవం

మల్కాజ్గిరి , (ప్రజాస్ఫూర్తి) : నేరేడ్ మెట్ గ్రామ బొడ్రాయి 11వ వార్షికోత్సవాలు పురస్కరించుకొని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓల్డ్ నేరేడ్మెట్ ప్రధాన రహదారిలోని శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వనాథ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ బొడ్రాయికి భక్తిశ్రద్ధలతో బోనం ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ శ్రేయస్సు, ప్రజల ఆరోగ్యం, సుఖసంతోషాల కోసం గ్రామ దేవత బొడ్రాయి కి బోనం, ఒడి బియ్యం సమర్పించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు గంగాధరి రాజు మాట్లాడుతూ వచ్చే తరాలకు బొడ్రాయి యొక్క ఆవశ్యకత తెలిసేలా పూర్వ చిత్రాలను సేకరించి ఫోటో ఎగ్జిబిషన్ గా ఏర్పాటు చేయాలని ఒక పుస్తకాన్ని రచించాలని బొడ్రాయి కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా బొడ్రాయి కమిటీ దేవాలయ కమిటీ సభ్యులను శాలువలతో సత్కరించడం జరిగింది.

# ఈ నెల 28 నుంచి జగద్గిరిగుట్ట నుంచి మెడారం జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులు

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : మెడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా జగద్గిరిగుట్ట నుంచి మెడారం జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహించబడుతాయని టీజీఎస్ఆర్టీసీ జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ, జీడిమెట్ల డిపో ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఉదయం తొలివేళల నుంచే ప్రారంభమవుతాయన్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులకు రూ. 630, మహాలక్ష్మి బస్సులకు జీరో టికెట్లు చెల్లుబాటు, డీలక్స్ బస్సులకు రూ. 720 లు చెల్లింపు టికెట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయన్నారు. సూపర్ లగ్జరీ బస్సులకు ఒక్కో ప్రయాణికునికి రూ. 820 చెల్లింపు టికెట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయని తెలిపారు. ప్రజలు ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను వినియోగించుకుని, సురక్షితంగా ప్రయాణించి సమ్మక్క-సారలమ్మ దేవతల దివ్య ఆశీస్సులు పొందగలరని కోరారు.

# మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త పబ్బు బిక్షపతి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్ ఆదివారం బిక్షపతి దశదినకర్మకు హాజరయ్యారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బిక్షపతి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ.21500ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ చిన్నం బాలరాజు కురుమ, మాజీ సర్పంచ్ చౌట వేణుగోపాల్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు పబ్బతి ఆంజనేయులు గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ పబ్బతి వెంకటయ్య గౌడ్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు పబ్బు కుమార్ గౌడ్, బిజెపి గ్రామ శాఖ అధ్యక్షుడు చౌట శివకుమార్ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్, గంజి లింగేష్, వార్డు సభ్యులు దబ్బటి ఉపేందర్ గౌడ్, పార అనసూయ శ్యామ్, కత్తుల సాయికుమార్, రవ్వ పాండరి, ఎస్ కే గాలిబ్, పబ్బతి అంజయ్య గౌడ్, దబ్బడి బాలరాజు గౌడ్, పాలమాకుల శంకరయ్య, మద్దోజు నరసింహ చారి, చిన్నం శివశంకర్ కురుమ, బొడిగె మల్లయ్య గౌడ్, బూడిద తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలే కాసానికి ఘన నివాళి

**: మచ్చ వెంకటేశ్వర్లు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్మించడమే కాసానికి ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. మంచికంటి భవన్‌లో నిర్వహించిన కాసాని వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. నిజాయితీతో ఎర్రజెండా నీడలో పనిచేసిన కాసాని నేటి తరానికి ఆదర్శమని, ఇళ్ల స్థలాల ఉద్యమం ద్వారా వేల మందికి న్యాయం చేశారని గుర్తుచేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటమే కాసానికి నివాళి అని అన్నారు. ఈ సభలో సిఐటియు, ఐఎన్టియుసి, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

*** సిపిఎం నాయకుడు యు. నాగేశ్వరరావు మృతికి సంతాపం**

లక్ష్మీదేవిపల్లి మాజీ మండల కార్యదర్శి ఉబ్బనపల్లి నాగేశ్వరరావు మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. మరణానంతరం తన దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి దానం చేసిన ఆయన జీవితం ఆదర్శమని పేర్కొంది. ఆయన మృతి పార్టీకి తీరని లోటని నాయకులు అన్నారు.

## ఐడిఓసి కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల లక్ష్యమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. అలాగే పాఠశాల విద్యార్థుల వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఎన్నికల విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన తాసిల్దార్లు, జిల్లా మాస్టర్ ట్రైనర్‌లను సత్కరించారు. బిఎల్ఓలకు అవసరమైన కిట్లు పంపిణీ చేశారు.జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌లను ప్రత్యేకంగా సన్మానించి, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెంట్ రంగ ప్రసాద్, తాసిల్దార్లు, అధికారులు, విద్యార్థులు, నూతన ఓటర్లు పాల్గొన్నారు.


## పివికె–5 గనిలో కార్మికులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆత్మీయ సమావేశం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ఏరియా పరిధిలోని 74 ఏళ్ల నాటి పివికె-5 అండర్‌గ్రౌండ్ గనిలో బొగ్గుగని కార్మికులతో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డలు అండర్‌గ్రౌండ్ గనుల్లో పనిచేయడం గర్వకారణమన్నారు. 136 ఏళ్ల చరిత్ర గల సింగరేణి సంస్థ రాష్ట్రానికి, దేశానికి ప్రత్యేక గుర్తింపునిచ్చిందని తెలిపారు.దేశ విద్యుత్ ఉత్పత్తిలో 74 శాతం బొగ్గుపైనే ఆధారపడుతున్నట్లు పేర్కొంటూ కార్మికుల శ్రమ వల్లే దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాలకు ఉపాధి లభిస్తోందన్నారు. ప్రతి కార్మికుడి ప్రాణం విలువైనదని, జీరో యాక్సిడెంట్ మైన్ పాలసీతో ముందుకు వెళ్లాలని కోల్ కంపెనీలకు సూచించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా బొగ్గుగని కార్మికులకు కోటి రూపాయల ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు చేస్తున్నామని వెల్లడించారు.సింగరేణిని రాజకీయాలకు అతీతంగా కాపాడుకోవాలని, ఖర్చులు తగ్గించి నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి పెంచాలని సూచించారు. సింగరేణి ప్రైవేటీకరణ దుష్ప్రచారం మాత్రమేనని స్పష్టం చేశారు. కోల్ గ్యాసిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ డి. కృష్ణభాస్కర్‌తో పాటు కేంద్ర, సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నేతలు, గని ఉద్యోగులు పాల్గొన్నారు.

## సింగరేణి బావులు సింగరేణికే కేటాయించాలి

*** నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ కిషన్‌రెడ్డికి వినతి**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థకు అపారమైన బొగ్గు నిల్వలు, ఉత్పత్తి సామర్థ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్నాయని ఐఎఫ్‌టీయూ నేతలు తెలిపారు. బొగ్గు గనులను వేలంలో అమ్మకానికి పెట్టడం విరమించి, సింగరేణి బావులను సింగరేణి సంస్థ ద్వారానే తవ్వకాలు నిర్వహించేలా కేటాయించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కోరారు. ఆదివారం మంత్రిని కలిసిన ఐఎఫ్‌టీయూ ప్రతినిధి బృందంలో గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ. కృష్ణ, జనరల్ సెక్రటరీ జే. సీతారామయ్య, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న, ఎన్. సంజీవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు జేబీసీసీఐ నిర్ణయించిన హైపవర్ వేతనాలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే దేశవ్యాప్తంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులకు హానికరమని పేర్కొంటూ, వాటిని ఉపసంహరించుకోవాలని కోరారు.

## విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్న బీఎంఆర్ఎస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పాత్ర ప్రశంసనీయం

*** ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**





సికింద్రాబాద్, (ప్రజాస్ఫూర్తి) : బీఎంఆర్ఎస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను విద్యార్థుల్లో నాటుతూ సమాజానికి ఉత్తమమైన పౌరులను అందిస్తోందని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రశంసించారు. బీఎంఆర్ఎస్ గ్రామర్ హై స్కూల్ 18వ వార్షికోత్సవాన్ని హరి హర కళాభవన్ లో అత్యంత ఘనంగా, ఉత్సాహభరితంగా జరుపుకున్నారు .ఈ వేడుకలకు ఆయనతో పాటు ఎమ్మెల్సీ పి. శ్రీపాల్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, కాచిగూడ రైల్వే డివిజన్ రిటైర్డ్ డైరెక్టర్ టి. ప్రభు చరణ్, మాజీ ఉప మేయర్ కె. స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ ఉప మేయర్ కె. లక్ష్మీ రవి గౌడ్ ట్రస్మా మెడ్చల్ జిల్లా అధ్యక్షులు జె. నాగరాజు, మాజీ కార్పొరేటర్ సామల పవన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్న బీఎంఆర్ఎస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పాత్ర ప్రశంసనీయం అన్నారు. ఇలాంటి ఉత్తమ విద్యా సంస్థ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇస్తూ, పాఠశాల యాజమాన్యం, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎం ఎల్ సి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ డైరెక్టర్ బి జైపాల్ రెడ్డి అతి చిన్న వయసులోనే విద్యారంగంలో అడుగుపెట్టి తల్లిదండ్రులు తన పైన పెట్టిన నమ్మకాన్ని బాధ్యతగా భావించి విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దుతున్నారని కొనియాడారు. బి ఎం ఆర్ ఎస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యా రంగంలో సాధిస్తున్న ప్రగతిని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బి. మల్లా రెడ్డి,డైరెక్టర్ బి. జైపాల్ రెడ్డి,బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యులు బి. రాఘవేందర్ రెడ్డి , బి. విజయేందర్ రెడ్డి కార్యక్రమానికి హాజరై అతిథులను సత్కరించారు. డైరెక్టర్ బి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ 18 సంవత్సరాల ప్రయాణంలో సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులకు పాఠశాల యాజమాన్యం తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ సమాజానికి ఉత్తమ పౌరులను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## పురపాలిక చట్ట సవరణ కాంగ్రెస్ గెలుపుతోనే సాధ్యం

*** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్రంలో నిర్వీర్యమైన పురపాలక చట్ట సమూల మార్పుల కోసం రానున్న పుర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్రెడ్డి రాజు కోరారు. హైద్రాబాద్లోని మున్సిపల్ చాంబర్స్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 'పైశాచిక ఆనందంతో పుర కౌన్సిల్ను నిర్వీర్యం చేయడంతో పాటు స్థానిక సంస్థల్లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఆత్మహత్యలే తప్పా మరో మార్గం లేకుండా చేసిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ స్థానిక ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం, అధికారాలు లేకుండా ప్రజల ముందు దోషిగా నిలబెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. పుర చట్టం వల్ల ప్రజా ప్రతినిధుల ఉనికే ప్రమాదకారిగా మారిందన్నారు. మున్సిపల్ చట్టం ప్రక్షాళన, ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యత పెరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకత తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టాలను పూర్తి స్థాయిలో విచ్చిన్నం చేసి ప్రజా ప్రతినిధుల ఉనికే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాజీవ్ గాంధీ కలలు గన్న 73,74 రాజ్యాంగ సవరణను అనుసరించి తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులకు అధికారాలు, పల్లెలు, పట్టణాల వికాసానికి కాంగ్రెస్తోనే సాధ్యమన్నారు. 2019లో చేసిన పురపాలిక చట్ట సవరణతో ఈ రోజు ఉన్నత వర్గాలు, మేధావులు, విజ్ఞులు స్థానిక సంస్థల్లో పోటీకి దూరమయ్యారని, కేవలం పేద వర్గాలు అవగాహన లేక గౌరవం కోసం పోటీ చేసి చితికిపోయి మనస్థాపంతో కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక ప్రజా ప్రతినిధుల అధికారాలు, గౌరవాన్ని దెబ్బతీసి అధికారులకే అధికారాలను అప్పగించి కేవలం నామ మాత్రంగా నిలిపారన్నారు. రాబోయే ఎన్నికల్లో పుర ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై కేవలం మానసికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చితికిపోవడం తప్పా కనీస గౌరవం లేని ఈ పదవులకు చట్ట సవరణ చేస్తే తప్పా మనుగడ లేదన్నారు. బిఆర్ఎస్కు ఏ మాత్రం అవకాశం ఇచ్చినా ప్రజా ప్రతినిధనలు చీమలు, దోమలుగా ఏరివేసే ప్రమాదం ఉందన్నారు. సిఎం రేవంత్రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందని, అధికారాలు, గౌరవం, చట్ట ప్రక్షాళన జరగాలంటే కాంగ్రెస్తోనే సాధ్యమౌతుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తే చట్టాలపై సమగ్రమైన అధ్యయనం చేసి చట్టాల్లో మార్పులకు దోహదపడుతుందన్నారు. చట్ట ప్రక్షాళనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యయనం చేసి అసెంబ్లీలో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. చట్టంలో మార్పులు రాకపోతే రాబోయే తరాలకు స్థానిక ప్రజా ప్రతినిధులే కరువయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. పురపాలక సంఘాలపై అజమాయిషీ కలెక్టర్ల నుంచి సిడిఎంఎకే అప్పగించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో అమలౌతున్న విధంగా తెలంగాణాలో చట్టాలను పున సమీక్షించాలని ఆయన కోరారు. పట్టణాల్లో అభివృద్ధి కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా టిడిఎస్ నిధులు రూ.2800 కోట్లు, అభివృద్ధి, మౌళిక సదుపాలయ కల్పన కోసం మరో రూ.2700 కోట్లు విడుదల చేసి అభివృద్ధి పథంలో సిఎం రేవంత్రెడ్డి ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో చాంబర్స్ ప్రతినిధులు అల్లంపల్లి నర్సింహా, చందు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా గాజులరామారం చిత్తారమ్మ జాతర

*** చింతలను తీర్చే చిత్తారమ్మ తల్లి భక్తులందరి కరుణించి కాపాడాలి**

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : గాజులరామారం గ్రామంలో వెలసిన శ్రీ చిత్తారమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా భారీ సంఖ్యలో భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ చింతలను తీర్చే చిత్తారమ్మ తల్లి భక్తులందరి కరుణించి కాపాడాలని అన్నారు. అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాచకొండ బాల్ రాజ్, కమిటీ సభ్యులు నర్సింహ ల, శంకర్ రెడ్డి, వంశీ గౌడ్, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవి యాదవ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అంజన్ గౌడ్, కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సుంకరి చందు, గోవర్ధన్ రెడ్డి, దూలప్ప, చిన్నా చౌదరి, చంద్రశేఖర్ రెడ్డి, బాబీ చౌదరి, చెట్ల వెంకటేష్, రాములు గౌడ్, సమ్మయ్య యాదవ్, ప్రసాద్, నవీన్, శివా నాయక్, జునైద్, గౌస్, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## 30 వ వార్డులో రాజకీయంగా తీవ్ర ఉత్కంఠ



ప్రజా స్ఫూర్తి, నల్లగొండ: 30 వ వార్డులో రానున్న మున్సిపల్ ఎన్నికలు రాజకీయంగా తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. ఈ ఎన్నికలు కేవలం టికెట్ పోటీగానే కాకుండా, ప్రజల ఓట్ల కోసం జరిగే హోరాహోరీ సమరంగా మారాయి. సిట్టింగ్ కౌన్సిలర్ నవీన్ కుమార్ గౌడ్ కు, యువ నాయకుడు షేక్ జహంగీర్ బాబాకు మధ్య జరుగుతున్న రాజకీయ పోరు ప్రస్తుతం వార్డు వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సమరంలో నవీన్ గౌడ్ తన రాజకీయ అనుభవంతో హ్యాట్రిక్ విజయం సాధిస్తారా? లేక యువ నాయకుడైన జహంగీర్ బాబా దూకుడుకు బెంబేలెత్తి ఓటమిని చవిచూస్తారా? అన్నది పూర్తిగా 30వ వార్డు ప్రజల తీర్పుపైనే ఆధారపడి ఉంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లో చేరిన నవీన్ కుమార్ గౌడ్ నిర్ణయం ఎన్నికల రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది. మరోవైపు, షేక్ జహంగీర్ బాబా తాను పాత కాంగ్రెస్ నాయకుడినని, పార్టీ సిద్ధాంతాలకు నిబద్ధుడినని చెప్పుకుంటూ ప్రజల్లో తన విశ్వసనీయతను పెంచుకుంటున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో 30వ వార్డు ప్రజలు మార్పును కోరుకుంటున్నారనే భావన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా యువతతో పాటు సాధారణ ప్రజలు కొత్త నాయకత్వం, పారదర్శక పాలన కోరుకుంటున్నారని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదే కారణంగా షేక్ జహంగీర్ బాబాకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నట్లు ఇన్సైడ్ టాక్ కొనసాగుతోంది. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ, 30వ వార్డు రాజకీయ సమరం మరింత ఉత్కంఠభరితంగా మారనుంది. ఈ కీలక పోరులో ఎవరి గెలుపు, ఎవరి ఓటమి అన్నది త్వరలోనే ప్రజలు తేల్చనున్నారు.

## ఓటమితో కుంగిపోకుండా గెలుపు దిశగా ప్రయత్నించాలి

*** హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్**

*** హైకోర్టు ఉద్యోగులు, సిబ్బందికి క్రీడాపోటీలు**



నారాయణగూడ : ఓటమికి కుంగిపోకుండా గెలుపు దిశగా ప్రయత్నించినపుడే ఆటల్లోనూ, జీవితంలోనూ ఉన్నతస్థాయికి చేరతారని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర హైకోర్టు అధికారులకు ప్రత్యేక క్రీడాపోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ.. తాను ఝార్ఖండ్ హైకోర్టులో ఉండగా అక్కడి ఉద్యోగులు, సిబ్బందికి ఏటా క్రీడా పోటీలు నిర్వహించేలా చేశానన్నారు. అదే తరహాలో ఇక్కడ కూడా తరచూ నిర్వహించాలని సంకల్పించినట్లు తెలిపారు. అనంతరం జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే జిల్లా కోర్టుల ఉద్యోగులకూ క్రీడాపోటీలు నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు.



ఈ సందర్భంగా జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ సహచర న్యాయమూర్తులతో కాసేపు సరదాగా క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్ రెడ్డి, ముహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్, క్రీడల పర్యవేక్షకులు శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించాలి

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం దుండిగల్ సర్కిల్ దుండిగల్ లో నిర్వహించిన "దుండిగల్ ప్రీమియర్ లీగ్" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై లీగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి చూపి దృఢంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శంభీపూర్ కృష్ణ, జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మేడ్చల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవి యాదవ్, జక్కుల కృష్ణ యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, కొల్తూరు మల్లేష్, పాక్స్ ఎక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, నాయకులు కమ్మరి వీరేష్, నర్సింగ్ గౌడ్, ధారా మహేష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతత అందించడంలో పార్కులు ఎంతగానో దోహదం

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**




కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : నేటి గజిబిజి యాంత్రిక జీవితంలో మానసిక ప్రశాంతత, పిల్లలకు ఆటవిడుపు అందించడంలో పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం గాజుల రామారం డివిజన్ బాలాజీ లే ఔట్ నందు రూ.45.00 లక్షలతో అభివృద్ధి చేసిన కాలనీ పార్కును బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన జీవితానికి పార్కులు ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ లేఔట్ సంక్షేమ సంఘం సభ్యులు, విశ్వనాథ్ రెడ్డి, అర్జున్ రావు, సతీష్ రెడ్డి, కాంతారావు, అనూప్ కుమార్, రవీందర్ రెడ్డి, సీతారామరెడ్డి, రాందాస్, కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, కేశవ, కోటిరెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి, జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవి యాదవ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అంజన్ గౌడ్, కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, మక్సూద్ అలీ, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సుంకరి చందు, గోవర్ధన్ రెడ్డి, దూలప్ప, చిన్నా చౌదరి, చంద్రశేఖర్ రెడ్డి, బాబీ చౌదరి, చెట్ల వెంకటేష్, రాములు గౌడ్, సమ్మయ్య యాదవ్, ప్రసాద్, నవీన్, శివా నాయక్, జునైద్, గౌస్, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## మా ప్రభుత్వానికి ఎవరిపైనా కక్ష లేదు: పొన్నం



కరీంనగర్ పట్టణం : ఫోన్ ట్యాపింగ్ విషయంలో తమ ప్రభుత్వం ఎవరిపై కక్షపూరితంగా వ్యవహరించడంలేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రథసప్తమి సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లో జరిగిన బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సూర్యప్రభ వాహన సేవలో పాల్గొన్నారు.'మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల ప్రమేయం ఉండదు. గతంలో ఎవరికి అనుకూలంగా వారు రిజర్వేషన్లు మార్చుకున్నారు. ఇప్పుడు అలా జరగదు. అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా ఉంటుంది' అని చెప్పారు. ఈనెల 28 నుంచి 31 వరకు సమ్మక్కసారలమ్మ జాతర ఉత్సవాలకు కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లోని 51 కేంద్రాల నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

## చదువుకున్నవారే ఓటుకు దూరమవడం విచారకరం

హైదరాబాద్: సమాజంలో మేధావులుగా చలామణి అయ్యే వారు ప్రభుత్వాలను విమర్శిస్తారని, ఓటు వేయడానికి మాత్రం ముందుకు రారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఆదివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యాలయంలో కొత్తగా ఓటు హక్కు పొందిన వారితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ''చదువుకున్నవారిలోనే ఓటింగ్ శాతం తగ్గుతుండటం ఆందోళనకరం. తుపాకులు పట్టుకుని, బాంబులు వేసి, ఉగ్రవాదంతో సమాజాన్ని మార్చలేరు. ఓటుతోనే మార్పు సాధ్యమవుతుందన్నారు.

# సింగరేణిని భ్రష్టుపట్టించిన కేసీఆర్, రేవంత్

* **రెండు పార్టీలు దొందు దొందే..**
* **ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీలోకి వెళ్లడం వీరికి సర్వసాధారణం**
* **కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణలో సిరులగనిగా పేరున్న సింగరేణిని కేసీఆర్, రేవంత్ ప్రభుత్వాలు భ్రష్టుపట్టించాయని, సింగరేణిని సొమ్మును దోచుకుని పంపకాల కోసం పోటీ పడుతున్నారని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణి కార్మికులు చెమటోడ్చి బొగ్గు ఉత్పత్తి చేసి లాభాలు తీసుకువస్తుంటే గత కేసీఆర్ ప్రభుత్వం, నేటి రేవంత్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల రక్తాన్ని పీల్చుకుంటున్నాయని తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తొలుత సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని 5షాఫ్ట్ భూగర్భ గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. భూగర్భ గనిలోకి దిగి బొగ్గు ఉత్పత్తి, గని పనితీరు, కార్మికుల సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన భారతీయ జనతా పార్టీ ఎన్నికల విజయ సంకల్ప సభకు ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలు కేసీఆర్ కుటుంబ చరిత్రలో తెలంగాణ అన్ని రంగాల్లో నష్టపోయిందని, కేసీఆర్ కుటుంబం, టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు తెలంగాణను దోచుకున్నారని విమర్శించారు. దోచుకున్న డబ్బులను పంచుకునేందుకు కేసీఆర్ కుటుంబం రోడ్డున పడిందని, కేసీఆర్ కుటుంబ, అవినీతి పాలన పోవాలని ప్రజలందరూ శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే.. ఆ పార్టీ కూడా దోపిడీకి పాల్పడుతుందన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని రేవంత్ ప్రభుత్వం అమలు చేయడం లేదని, అనేక గ్యారెంటీలు ఇచ్చినా...ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని విమర్శించారు. ఫ్రీ బస్సు పథకం ఎందుకు అమలు చేస్తునారో అర్థం కావడంలేదన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని అన్నారు.

* **సంక్షేమ పథకాలను అమలు చేయలేని స్థితిలో సింగరేణి**

సింగరేణి గత 12 సంవత్సరాలుగా నష్టాల భారిన పడి దోపిడీకి గురవుతోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. సింగరేణి కార్మికులు రక్తాన్ని చమటగా మార్చి బొగ్గు ఉత్పత్తి చేస్తే కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు, కూతురు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎక్కడ పడితే అక్కడ సింగరేణిని దోచుకున్నారని ఆరోపించారు. నేడు సింగరేణి కార్మికులకు సంస్థ జీతాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేని పరిస్థితిలో ఉందని, బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని వేతనాలు ఇచ్చే పరిస్థితి నెలకొందని, దీనికి కారణం బీఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా సింగరేణిలో ఇదే తీరు కొనసాగుతుందన్నారు. మెస్సీ అనే ఫుట్‌బాల్ ఆటగాడు వస్తే సింగరేణి నుంచి రూ.10 కోట్ల నిధులు ఖర్చుచేశారని దుయ్యబట్టారు. సింగరేణి సంస్థ డబ్బులు ఖర్చుపెట్టడానికి రేవంత్ రెడ్డికి అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఫామ్‌హౌజ్‌లో ఉన్న కేసీఆర్ రూ.35 వేల కోట్లు అప్పు పెట్టగా, రేవంత్ రెడ్డి వచ్చిన నాటి నుంచి సింగరేణికి ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. సింగరేణి సంస్థ జీతాలు ఇవ్వలేక, సంక్షేమ పథకాలు అమలు చేయలేకపోతుందని, సంస్థలో నూతన యంత్రాలను కొనుగోలు చేయలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

* **మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి**

సింగరేణి కార్మిక ప్రాంత ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఎందుకు ఓటు వేయాలో ఆలోచించుకోవాలి అని కిషన్‌రెడ్డి కోరారు. జిల్లాలోని అశ్వారావుపేట, ఇల్లందు మున్సిపాలిటీలు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఫిబ్రవరి రెండవ వారంలో ఎన్నికలు జరుగుతాయన్నారు. అన్ని సీట్లలో బీజేపీ పోటీ చేస్తుందని అన్నారు. సర్పంచ్, జెడ్పీటీసీ, మేయర్, కౌన్సిలర్, కార్పొరేట్ ఇలా ఏ ఎన్నికలు అయినా దేశంలో ఎక్కడ చూసినా బీజేపీ ప్రభంజనం నెలకొందని, జై శ్రీరామ్ నినాదంతో కాషాయం జెండా ఎగురుతుందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీ పార్టీ అభ్యర్థులను అన్ని స్థానాల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎన్నికల ఇన్‌చార్జి మార్తినేని ధర్మారావు, సీనియర్ నాయకులు విజయ్ చందర్ రెడ్డి, జివికె. మనోహర్, వాసుదేవరావు, గొడుగు శ్రీధర్, గుంపుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్లిష్టమైన విపుల్ శస్త్రచికిత్స ద్వారా
# రోగి ప్రాణాలను కాపాడిన యశోదా వైద్య బృందం




ప్రజా స్ఫూర్తి, నల్లగొండ: క్లిష్టమైన విపుల్ శస్త్ర చికిత్స ద్వారా హైదరాబాదులోని మలక్పేట యశోద ఆసుపత్రిలో రోగి ప్రాణాలను కాపాడినట్లు యశోద హాస్పిటల్ వైద్య బృందం తెలియజేసింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ శ్రీపతి మాట్లాడుతూ శాస్త్ర చికిత్స కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. జిల్లాలోని షాపల్లికి చెందిన ఉపేందర్ అనే వ్యక్తికి ఇమేజింగ్ , ప్యాంక్రియాసిస్ వల్ల తల భాగంలో గడ్డ ఏర్పడి విత్తనాలం ఒత్తిడికి గురై పిత్తరసం ఆగిపోయినట్లు తెలిపారు దీనివల్ల అబ్స్ట్రాక్టివ్ జాండీస్ ఏర్పడి రోగికి టైప్ 2 డయాబెటిస్ హైపర్ టెన్షన్ స్వాత శ్వాస సంబంధించిన సమస్యలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో గ్యాస్ట్రోఎంటరాలజీ , అంకాలజీ, అనస్తీసియా వైద్య బృందం ఒక నిర్ధారణకు వచ్చి ఇందుకుగాను విపుల్ శస్త్ర చికిత్స మార్గమని భావించి రోగి ప్రాణాలను కాపాడేందుకు అణస్తీసియా ఇచ్చి ప్యాంక్రియా టికోడ్యూడేనెక్టమి నిర్వహించి క్లిష్టమైన పరిస్థితిలో శస్త్ర చికిత్స చేసి తల భాగంలో ఉన్న గడ్డతోపాటు పిత్తనాలను తొలగించినట్లు పేర్కొన్నారు. సాధసాధారణం g a ప్యాంక్రియాస్ (అగ్నాశయం) సంబంధిత వ్యాధులు ప్రారంభ దశలో ఎక్కువగా లక్షణాలు చూపించకపోయినా, కీలక అవయవాలను ప్రభావితం చేసినప్పుడు అకస్మాత్తుగా ప్రాణాపాయ స్థితికి దారి తీస్తాయన్నారు. ముఖ్యంగా ప్యాంక్రియాస్ తల భాగంలో ఏర్పడే గడ్డ లేదా కణితి, కాలేయం నుంచి పిత్తరసం ప్రవహించే నాళాన్ని అడ్డుకోవడం వల్ల అబ్ స్ట్రక్టివ్ జాండీస్ ఏర్పడుతుందni తెలిపారు. ఈ పరిస్థితిని సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, అవయవ వైఫల్యం, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా సంభవించే అవకాశం ఉంటుందni అన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో తొందరగా నిర్ధారణ, ఆధునిక ఇమేజింగ్ పరీక్షలు మరియు సమయానికి జరిగే క్లిష్టతరమైన శస్త్రచికిత్సే ప్రాణాలను కాపాడ గలగడమే మార్గమని, ఇలాంటి అత్యంత క్లిష్టమైన మరియు అధిక ప్రమాద స్థితిలో, యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్ వైద్యులు ఒక మధ్య వయస్కుడైన రోగి ప్రాణాలను విపుల్ ప్యాంక్రియాటికోడ్యూడెనెక్టమీ (Whipple's Surgery) అనే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా కాపాడినట్లు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి మరియు ముందే ఉన్న ఇతర వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ఐసీయూలో ఉంచి సన్నిహిత పర్యవేక్షణ చేస్తున్న సందర్భంలో శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తడంతో వెంటిలేటర్ సహాయం, ఆక్సిజన్ థెరపీ, యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ, పోషకాహార సహాయం మరియు నిరంతర క్రిటికల్ కేర్ అందించినట్లు తెలిపారు . ఈ సమావేశంలో ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర, ఎ. వాసుకిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

* **48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి..**
* **రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..**
* **ట్రాక్టర్ నడిపి పార్టీ శ్రేణులు జోష్ నింపిన మంత్రి..**




ప్రజా స్ఫూర్తి, నల్లగొండ: నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు అధిక నిధులు తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రోడ్లు,భవనాలు,గ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో పోటీ చేసే పలువురి అభ్యర్థుల పేర్లను మంత్రి ప్రకటించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ లోని 6 వ డివిజన్లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి 25, 41, 19 డివిజన్ లో నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ట్రాక్టర్ నడిపి మంత్రి పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే కార్పొరేషన్ ఎన్నికలలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ లోని 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.నల్గొండ మున్సిపాలిటీని అభివృద్ధి చేసింది నేనే.. చేసేది నేనే నని మంత్రి స్పష్టం చేశారు.తనను ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ఇక్కడి ప్రజల రుణం తీర్చుకోలేనిదని మంత్రి అన్నారు..పేద ప్రజలకు ఏ ఆపద వచ్చిన తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు.ఆ పార్టీని ప్రజలు ఎప్పుడో బొంద పెట్టారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. నల్గొండ మున్సిపాలిటీలో రూ.2,200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నల్గొండ మున్సిపాలిటీని కార్పొరేషన్ గా చేయడంతో మరింత అభివృద్ధి జరుగుతుంది. అన్ని డివిజన్లోని సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అన్ని డివిజన్లలో ప్రతిరోజు తాగునీరు వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల అభివృద్ధికి పెద్దపీట వేసిందని అన్నారు. మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు.ఇప్పటికే పలుచోట్ల పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు మహిళా సంఘాలకు కేటాయించడం జరిగిందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హఫీజ్ ఖాన్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, పిఎసిఎస్ చైర్మన్ 18వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి ఆలకుంట నాగరత్నం రాజు ,డిసిసిబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జూలకంటి శ్రీనివాస్, కర్నాటి కరుణాకర్ రెడ్డి, కేసాని వేణుగోపాల్ రెడ్డి, గోగుల గణేష్, లోకేశ్వరి రెడ్డి, కత్తుల వెంకట్ ,విక్రం రెడ్డి, అన్వర్, ఎండి హఫీజ్, అజ్గర్, మేడోజు శ్రీనివాస్, జగాల్ రెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెండ్రోజుల్లో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్: మంత్రి ఉత్తమ్

కోరుట్ల, మెట్‌పల్లి పట్టణం: అన్ని మతాల సమ్మేళనమే కాంగ్రెస్ పార్టీ అని.. దేశంలో భాజపాను ఓడించాలంటే తమ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ నాయకుల, కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి టికెట్లు దక్కని వారు అధైర్య పడొద్దని.. వారికి నామినేట్ పదవులు ఇస్తామన్నారు. సన్నబియ్యం కోసం ఏటా రూ.13,600 కోట్ల నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల్లో మున్సిపల్ షెడ్యూల్ విడుదల అవుతుందని, ఫిబ్రవరి 2వ వారంలో ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. 90 శాతం మున్సిపల్‌లను



కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలును భాజపా అడ్డుకుందని విమర్శించారు. మున్సిపల్‌లలో అధికార కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగరవేస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య, నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు.



## మేడారం.. కిక్కిరిసిన భక్తజనం

తాడ్వాయి: వనదేవతల మహా జాతర సందడి రోజురోజుకూ పెరుగుతోంది. ములుగు జిల్లాలో సమ్మక్క, సారలమ్మ జాతర ఈ నెల 28 నుంచి ప్రారంభం కానుండడంతో ముందుగానే భక్తులు మేడారం బాట పడుతున్నారు. ఆదివారం వేలల్లో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి ప్రత్యేక వాహనాలు, బస్సుల్లో కుటుంబ సమేతంగా వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. దీంతో మేడారంతో పాటు పరిసరాలన్నీ భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. క్యూలైన్లలో బారులుతీరి గద్దెల ప్రాంగణం చేరుకొని బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## క్యాన్సర్‌పై యుద్ధంలో అలుపెరగని దత్తాత్రేయుడు.. మన పద్మభూషణుడు

క్యాన్సర్ అంటే మరణశాసనం కాదు.. అది జయించదగిన జబ్బు అని ప్రపంచానికి చాటారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ.. ఎందరికో పునర్జన్మనిచ్చారు. మన దేశ మాజీ ప్రధానుల నుంచి అమెరికా అధ్యక్షుల వరకు అందరికీ ఆత్మీయ వైద్యుడిగా పేరుగాంచారు. ఆయనే డాక్టర్ నోరి దత్తాత్రేయుడు. ఆయన సేవల్ని గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. కృష్ణా జిల్లా మంటాడలో ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో దత్తాత్రేయుడు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం మచిలీపట్నంలో సాగింది. కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, హైదరాబాద్ ఉస్మానియాలో



ఎండీ చేశారు. ఆ సమయంలోనే క్యాన్సర్‌ను అంతం చేయాలనే గట్టి సంకల్పాన్ని గుండెల్లో నింపుకొన్నారు. కేవలం 8 డాలర్లతో అమెరికా గడ్డపై అడుగుపెట్టారు. ఈనాడు ప్రపంచం గర్వించే స్థాయికి చేరుకున్నారు. వైద్య ప్రపంచంలో డాక్టర్ నోరి పేరు వినగానే గుర్తొచ్చేది బ్రాకీ థెరపీ. అప్పట్లో క్యాన్సర్ చికిత్స అంటే శరీరమంతా రేడియేషన్ ఇచ్చేవారు. కానీ, డాక్టర్ నోరీ క్యాన్సర్ ఉన్న కణతి దగ్గరే రేడియో ధార్మిక పదార్థాలను ఉంచి చికిత్స చేసే వినూత్న పద్ధతిని ప్రపంచానికి పరిచయం చేశారు. ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్ చికిత్సలో ఆయన తీసుకొచ్చిన మార్పులు లక్షలాది మంది ప్రాణాలను కాపాడాయి. కంప్యూటర్ ఎయిడెడ్ బ్రాకీ థెరపీ విధానానికి ఆయన్నే ఆద్యుడిగా పిలుస్తారు. ఎన్ని దేశాలు తిరిగినా, ఎన్ని గౌరవాలు పొందినా తన సొంతగడ్డపై ప్రేమను మరిచిపోలేదు. హైదరాబాద్‌లోని ఇండో అమెరికన్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి స్థాపనలో ఆయన కృషి వెలకట్టలేనిది. అమరావతిలో ప్రపంచస్థాయి క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి నోరి దత్తాత్రేయుడు అంకురార్పణ చేశారు. మారుమూల గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తూ పేదవారికి అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉంచడమే తన లక్ష్యమని ఆయన నిరూపించారు. ప్రస్తుత కాలంలో క్యాన్సర్ చికిత్సలో వస్తున్న మార్పులపై డాక్టర్ నోరి మరింత చురుగ్గా పనిచేస్తున్నారు. ఏఐ సాయంతో క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించే సాంకేతికతను భారత్‌కు తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవల ఏపీ ప్రభుత్వానికి వైద్య ఆరోగ్య రంగంలో ప్రత్యేక సలహాదారుగా వ్యవహరిస్తూ.. ప్రతి జిల్లాలో క్యాన్సర్ కేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

## కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాష్ట్రాన్ని దోచుకున్నారు

**: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

కొత్తగూడెం (సింగరేణి): మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాష్ట్రాన్ని దోచుకున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన భాజపా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ''దోచుకున్నది పంచుకోవడంలో ఏర్పడిన విభేదాల కారణంగానే కేసీఆర్ కుటుంబం విచ్ఛిన్నమైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ దూప్ ఫైట్లు నిర్వహించుకుంటున్నాయి. సింగరేణి సంస్థను గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటోంది. డబ్బు కోసం పార్టీలు మారుస్తూ రాజ్యాంగానికి తూట్లు పట్టిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు మున్సిపాలిటీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని'' అన్నారు. రానున్న మున్సిపల్



ఎన్నికల్లో అన్ని స్థానాల్లో భాజపా అభ్యర్థులు పోటీ చేయాలని ఆ పార్టీ నిర్ణయించిందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసి కాషాయం జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## నుమాయిష్‌కు పోటెత్తిన సందర్శకులు.. నాంపల్లిలో రద్దీ

హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న నుమాయిష్‌కు సందర్శకులు పోటెత్తారు. ఆదివారం కావడంతో కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అబిడ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో నిన్న భద్రతా కారణాల వల్ల ప్రవేశాన్ని నిలిపివేయగా, ఈరోజు పరిస్థితులు సాధారణ స్థితికి రావడంతో నుమాయిష్ యథావిధిగా కొనసాగుతోంది. రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రత్యేక లైన్లలో ప్రజలను నుమాయిష్ ప్రాంగణం లోపలికి పంపిస్తున్నారు.



## నాంపల్లి అగ్నిప్రమాదం.. పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

హైదరాబాద్: నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో అగ్ని ప్రమాద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరో వైపు భవన యజమాని సతీశ్ బచాస్‌ను అబిడ్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిన్న మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. అగ్ని ప్రమాద ఘటన అత్యంత దురదృష్టకరమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఐదుగరు మరణించడం



బాధాకరమన్నారు. ఫర్నిచర్ దుకాణం యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అగ్ని ప్రమాదంపై హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా జీహెచ్ఎంసీ, పోలీస్, రెవెన్యూ, హైడ్రా అధికారులు సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని భవనాలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు.

## పాపికొండలు టికెట్లు ఇచ్చారు.. బోట్లు ఎక్కడ? ఏజెంట్ కార్యాలయం వద్ద ఆందోళన

భద్రాచలం: భద్రాచలం రామాలయం ప్రాంతంలో ఉన్న పాపికొండలు బోటు ఏజెంట్ కార్యాలయం వద్ద పర్యాటకులు ఆందోళనకు దిగారు. తెలంగాణలోని పలు ప్రాంతాలకు చెందిన 200 మంది పర్యాటకులు పాపికొండలు విహారయాత్రకు టికెట్లు బుక్ చేసుకుని పోలవరం బోట్ పాయింట్‌కు వెళ్లారు. అయితే అక్కడ బోట్లు అందుబాటులో లేకపోవడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.1500 చొప్పున వసూలు చేశారని, పాయింట్ వద్ద



బోట్లు అందుబాటులో లేవని వారు వాపోయారు. ఫిర్యాదు చేసేందుకు సెల్‌ఫోన్లలో సిగ్నల్స్ రాక తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. సాయంత్రం భద్రాచలం చేరుకున్న పర్యాటకులు.. టికెట్లు బుక్ చేసుకున్న ఏజెంట్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు.

## పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలు.. భారీ బందోబస్తు



సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో రేపు ఉదయం 9 గంటలకు గణతంత్ర వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించనున్నారు. అనంతరం గవర్నర్ ప్రజలను ఉద్దేశించి సందేశం ఇవ్వనున్నారు. వేడుకల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక జిల్లాల కేంద్రాల్లో గణతంత్ర వేడుకలను జిల్లా కలెక్టర్లు నిర్వహించనున్నారు. కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు జాతీయ జెండాలతో అలంకరించబడ్డాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. అటు రాజకీయ పార్టీ ఆఫీసుల్లోనూ మువ్వన్నెలు రెపరెపలాడనున్నాయి. ఆయా పార్టీల అధ్యక్షులు జాతీయ జెండాలను ఎగుర వేయనున్నారు.

## సైట్ విజిట్ నిబంధన పెట్టిన అన్ని టెండర్లూ రద్దు చేయాలి

**: హరీశ్‌రావు**

హైదరాబాద్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన 40 ఏళ్ల అనుభవాన్ని ఉపయోగించి సీఎం రేవంత్‌ను బొగ్గు కుంభకోణం నుంచి బయటపడేసేందుకు యత్నించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ స్కామ్‌ను బయటపెట్టిన తమ పార్టీపై బురద జల్లుతున్నారన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడారు. ''2025 మేలో సైట్ సర్టిఫికెట్ నిబంధన వచ్చింది. దీని తొలి లబ్ధిదారు సీఎం బంధువు, శోధా కన్‌స్ట్రక్షన్ యజమాని సృజన్‌రెడ్డి. ఆ తర్వాత అన్ని టెండర్లకు సైట్ విజిట్ నిబంధన పెట్టారు. ప్రతి టెండర్‌కు ప్లస్ టెన్ పద్ధతి ఫాలో అయ్యారు. స్కామ్‌లు జరగలేదని నమ్మించేందుకు భట్టి విక్రమార్క ప్రయత్నిస్తున్నారు. నైనీ కోల్ బ్లాక్ ఒక్కటే కాదు.. పారదర్శకత, నిజాయతీ ఉంటే సైట్ విజిట్ నిబంధన పెట్టిన అన్ని టెండర్లూ రద్దు చేయాలి. 2025 మే నుంచి ఎన్ని టెండర్లు పిలిచారు.. ఎంతమందికి సర్టిఫికెట్ ఇచ్చారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. తమకు సైట్ విజిట్ సర్టిఫికెట్లు ఇవ్వట్లేదని.. కావాల్సిన వారికే ఇచ్చారని జీసీసీ, మహాలక్ష్మి వంటి అనేక కంపెనీలు ఫిర్యాదు చేశాయి. నా వద్ద ఫొటోలు, వీడియోలు, మెయిల్స్ ఉన్నాయి. విచారణకు



ఆదేశిస్తే ఆధారాలు ఇస్తా. సమయం వచ్చినప్పుడు అవన్నీ బయటపెడతా'' అని హరీశ్‌రావు అన్నారు.

## గుడ్‌న్యూస్.. వచ్చే నెల మొదటి వారంలో టీజీసెట్స్ నోటిఫికేషన్లు

రాష్ట్రంలో వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే వివిధ ఉమ్మడి ప్రవేశ పరీక్షల (టీజీసెట్స్ 2026) సందడి మొదలైంది. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లను ఫిబ్రవరి మొదటి వారంలో విడుదల చేసేందుకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి కసరత్తు చేస్తోంది. నోటిఫికేషన్ల విడుదలకు ముందుగా, ఈ నెల 30న ఈఏపీసెట్ కమిటీ సమావేశం కానుంది. ఈ సమావేశంలో ప్రవేశ పరీక్షల నిర్వహణ, ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ, పరీక్షా కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై ఉన్నత విద్యా మండలి అధికారులు వివిధ సెట్ల కన్వీనర్లతో సమగ్రంగా చర్చించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం, మే మొదటి వారం నుంచి ఈ ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

# ఆర్జేడీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీ యాదవ్

రాష్ట్రీయ జనతాదళ్ పార్టీకి నూతన జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీ యాదవ్ నియమితులయ్యారు. ఆర్జేడీ కీలక సమావేశంలో పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఈ నియామకాన్ని ప్రకటించారు. పార్టీ అగ్రనేతల సమక్షంలో తేజస్వీకి నియామక లేఖను అందజేశారు. లాలూ కుటుంబంలో వివాదాలు చెలరేగుతున్న సమయంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిల చిన్న కుమారుడైన తేజస్వీ పార్టీలో ముఖ్య నేతగా కొనసాగుతున్నారు. 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ బిహార్‌లో అతిపెద్ద పార్టీగా అవతరించడంలో తేజస్వీ కీలక పాత్ర పోషించాడు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సేవలు అందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి ఎన్నికల ప్రచారాల్లో చురుకుగా పాల్గొన్నారు. రాఘోపుర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, భాజపా అభ్యర్థి సతీశ్ కుమార్‌పై 14,532 ఓట్ల తేడాతో నెగ్గారు.

**ఆక్రమణదారుల చేతుల్లోకి ఆర్జేడీ:** లాలూ కుమార్తె




ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య.. తేజస్వీపై పరోక్షంగా విమర్శలు చేశారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన తమ పార్టీని కొందరు వ్యక్తులు పూర్తిగా నాశనం చేయాలని చూస్తున్నారన్నారు. ఒకప్పుడు ప్రజల హక్కుల కోసం పోరాడిన పార్టీ ఇప్పుడు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆర్జేడీ దుస్థితికి కారణమైన అటువంటి వారిని ఆర్జేడీ కార్యకర్తలే ప్రశ్నిస్తారన్నారు.

## శుభాంశు శుక్లాకు అశోక చక్ర..

### ముగ్గురికి కీర్తి చక్ర

భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు కేంద్రం ప్రతిష్ఠాత్మక సైనిక పురస్కారం 'అశోక చక్ర'ను ప్రకటించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) లోకి వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామిగా శుభాంశు రికార్డు సృష్టించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సాయుధ దళాలకు చెందిన 70 మంది సిబ్బందికి శౌర్య పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. వీరిలో ఆరుగురికి మరణానంతరం ప్రకటించారు. మేజర్ అర్ష్‌దీప్ సింగ్, నాయబ్ సుబేదార్ డోలేశ్వర్ సుబ్బా, గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌లకు 'కీర్తి చక్ర'



పురస్కారాలు వరించాయి. 13 మందికి 'శౌర్య చక్ర', ఒకరికి బార్ టు సేన పతకం, 44 మందికి సేన, ఆరుగురికి నౌ సేన, ఇద్దరికి వాయుసేన పతకాలు ప్రకటించారు.

**కీలక మిషన్‌లో భాగం..**

గతేడాది నిర్వహించిన యాక్సియం 4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా విజయవంతంగా అంతరిక్ష యాత్ర పూర్తి చేసిన విషయం తెలిసిందే. యాక్సియం 4 మిషన్‌లో భాగంగా పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ విస్నియెస్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లతో కలిసి ఐఎస్ఎస్‌కు వెళ్లిన శుభాంశు.. అంతరిక్షంలో అనేక ప్రయోగాలు చేశారు. ఖగోళంలోని జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై అధ్యయనం చేశారు. ఖగోళంలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను చిత్రీకరించారు. అంతరిక్షంలో వ్యోమగాముల మానసిక ఆరోగ్యంపై సైతం అధ్యయనం చేశారు.


## ఎవరికీ తలవంచం: విజయ్

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఒంటరిగానే విజయం సాధిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ పేర్కొన్నారు. మరికొద్ది నెలల్లో జరిగేది ఎన్నికల పోరు కాదని.. ప్రజాస్వామ్య యుద్ధమన్నారు. మహాబలిపురంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం టీవీకే పార్టీకి 'విజిల్' గుర్తు కేటాయించిన సంగతి తెలిసిందే. దీన్ని ఆయన ఇక్కడ ఆవిష్కరించారు. 'తమిళనాడు ఎన్నికల్లో ఒంటరిగానే విజయం సాధిస్తాం. అందుకు తగ్గ సైన్యం మావద్ద ఉంది. ఇది ఎన్నికల పోరు కాదు.. ప్రజాస్వామ్య యుద్ధం. అన్నాడీఎంకే ప్రత్యక్షంగా.. డీఎంకే పరోక్షంగా భాజపాకి సరెండర్ అయ్యాయి. టీవీకే ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గదు. డీఎంకే ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చింది. ఎవరికీ తలవంచం.. దేనికీ రాజీపడే ప్రసక్తే లేదు. మనమందరం కలిసికట్టుగా ఉంటే విజయం మనదే. రాష్ట్రంలో అవినీతి అంతానికి సమయం ఆసన్నమైంది' అని విజయ్ అన్నారు. దుష్ట శక్తులను, అవినీతిపరులను ఎదుర్కొనే ధైర్యం తమ పార్టీకి మాత్రమే ఉందన్నారు.



## భారత అభివృద్ధిలో భాగ్యవిధాతలు మీరే: యువతకు మోదీ లేఖ

దేశంలో నిర్వహించే అన్ని ప్రజాస్వామ్య ప్రక్రియల్లో యువత భాగం కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఓటు హక్కును వినియోగించుకోవడం కేవలం దేశ ప్రజల హక్కు మాత్రమే కాదని.. దేశ భవిష్యత్తును రూపొందించడంలో మనకు ఉన్న బాధ్యతని అన్నారు. ఓటువేయడం రాజ్యాంగం మనకిచ్చిన గొప్ప హక్కు అని.. దీని ద్వారానే దేశ భవిష్యత్తుకు దారి ఏర్పడుతుందన్నారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో కీలకపాత్ర



పోషించే భాగ్యవిధాతలు ఓటర్లేనని పేర్కొన్నారు. మన దేశ విధిని మార్చగలిగే శక్తి ప్రజలు వేసే ఓట్లకు ఉంటుందన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మైభారత్ వాలంటీర్లకు రాసిన లేఖలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలను బలోపేతం చేయడానికి భారత ఎన్నికల కమిషన్ చేస్తున్న కృషిని ప్రధాని అభినందించారు. ఈసీ దేశంలో ఎన్నికలను నిబద్ధతతో నిర్వహిస్తోందన్నారు. ఏదైనా రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినప్పుడు.. ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన ఎందరో ప్రజలు తమ గ్రామాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంటుంటారని మోదీ పేర్కొన్నారు. హిమాలయాలలో, అండమాన్ దీవుల్లో, దట్టమైన అడవుల్లో ఉన్నా ఎన్నికల సమయానికి తమ స్వస్థలాలకు చేరుకుంటారన్నారు. ఈ చర్యలు ప్రజాస్వామ్య విలువల పట్ల వారికున్న బాధ్యతను తెలియజేస్తాయన్నారు. రాబోయే తరాలు కూడా ఇదే నిబద్ధతతో ఉండాలని హితవు పలికారు. భారత్ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం చాలా కీలకమని ప్రధాని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో స్త్రీలు ముందుకు వెళ్తుండడంతో దేశ పునాదులు మరింత బలోపేతం అవుతున్నాయన్నారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియ..

## బెంగాల్ మంత్రికి ఈసీ నోటీసులు

పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి స్థానిక మంత్రి శశి పంజాకు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఇటీవల చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో మంత్రి ఓటరు మ్యాపింగ్‌కు సంబంధించిన పలు విషయాలపై స్పష్టత లేకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. దీనిపై మంత్రి స్పందిస్తూ.. 2002లో రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ సమయంలో సంబంధిత పత్రాలన్నీ ఎన్నికల కమిషన్‌కు సమర్పించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ తన వివరాలు లేవని అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. సర్ విచారణకు హాజరవుతానని తెలిపారు. తృణమూల్ ఐటీ సెల్ విభాగం ఇన్‌ఛార్జి దేబాంశు భట్టాచార్యకు కూడా ఈసీ



నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. తనకు, తన కుటుంబ సభ్యులకు ఓటరు మ్యాపింగ్ విషయంలో ఈసీ నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తమ ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకపోయినా.. భాజపా కృత్రిమ మేధను ఉపయోగించి పార్టీకి వ్యతిరేకంగా ఉన్నవారిని టార్గెట్ చేస్తోందని ఆరోపించారు.

## అమెరికా రాయబారితో భారత విదేశాంగ మంత్రి కీలక భేటీ..!

అమెరికా రాయబారి, ట్రంప్ సన్నిహితుడు సెర్గియో గోర్‌తో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ నేడు భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య భద్రత, వాణిజ్యం, సంక్లిష్ట టెక్నాలజీల్లో సహకారం వంటి అంశాలు పురోగతి సాధించేలా చర్చలు జరిగనట్లు ఎస్ జైశంకర్, గోర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. భారత్ అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్న వేళ ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకొంది. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా తగ్గించిన నేపథ్యంలో 25శాతం టారిఫ్‌లను వెనక్కి తీసుకొనే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఆ దేశ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ కూడా ఇటీవల ధ్రువీకరించారు. ''భారత్‌పై మేము విధించిన 25శాతం టారిఫ్‌లు భారీగా విజయవంతమయ్యాయి. రష్యా నుంచి



భారత్ చమురుకొనుగోళ్లు పడిపోయాయి. ఇంకా టారిఫ్‌లు అమల్లో ఉన్నాయి. ఇప్పుడు వాటిని వెనక్కి తీసుకొనే మార్గం కనిపిస్తోంది'' అని ఓ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానించారు.

## వాయుకాలుష్యం.. కోట్లాదిమందిపై భారం



: **రాహుల్ గాంధీ**


వాయు కాలుష్యం సమస్య కారణంగా ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా చిన్నారులు, వయోవృద్ధుల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. ఈ సంక్షోభాన్ని విస్మరించకూడదని, మార్పు దిశగా మొదటి అడుగు మన గళాన్ని వినిపించడమేనని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. ''వాయు కాలుష్యం కారణంగా ఆరోగ్యం, ఆర్థిక రూపంలో ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. కోట్లాది మంది సామాన్య పౌరులు రోజూ ఈ భారాన్ని మోస్తున్నారు. ప్రజల జీవనోపాధి దెబ్బతింటోంది. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలపై తీవ్ర ప్రభావం పడుతోంది'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వాయు కాలుష్యం ఎలా ప్రభావితం చేసిందో ప్రజలు తమ అనుభవాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల గొంతుకను వినిపించడం తన కర్తవ్యమని చెప్పారు. దిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. దేశ రాజధానికి ఊపిరి పోయడానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇందులో భాగంగా కేంద్రంతో పాటు దిల్లీ ప్రభుత్వానికి స్పష్టమైన గడువు విధించింది. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) సూచించిన సిఫార్సులను ఎలా అమలు చేస్తారో చెబుతూ.. రాబోయే 4 వారాల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.

## భార్య కోసం.. 600 కి.మీ. రిక్షా తొక్కిన 70 ఏళ్ల వృద్ధుడు

కటిక పేదరికం వెంటాడుతోంది. వయసు సహకరించడం లేదు. మరోవైపు అనారోగ్యం బారిన పడ్డ భార్య. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లడానికి చేతిలో చిల్లి గవ్వ లేదు. కానీ ఆమెను కాపాడుకోవాలనే సంకల్పం బలంగా ఉంది. ఇందుకోసం ఏకంగా 600 కిలోమీటర్లు రిక్షా తొక్కి భార్యకు చికిత్స అందించాడు 70 ఏళ్ల వృద్ధుడు. ఈ ఘటన ఒడిశాలో చోటుచేసుకుంది. సంబల్‌పుర్‌కు చెందిన లోహార్ రిక్షా తొక్కుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య జ్యోతి గత ఏడాది అనారోగ్యం బారిన పడ్డారు. మెరుగైన వైద్యం కోసం కటక్‌లోని ప్రభుత్వ ఎస్‌సీబీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని స్థానిక వైద్యులు సూచించారు. అంబులెన్స్, ఇతర వాహనాల ద్వారా వెళ్లేందుకు డబ్బుల్లేవు. కానీ ఎలాగైన భార్యకు చికిత్స అందించాలని ముందడుగు వేశాడు. ఇందుకోసం భార్యను రిక్షాలో తీసుకొని బయలుదేరాడు. రోజుకు దాదాపు 30 కిలో మీటర్లు రిక్షా తొక్కుతూ తొమ్మిది రోజులకు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కటక్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నాడు. ఆమెకు ఆసుపత్రిలో రెండునెలల పాటు చికిత్స అందించారు. అనంతరం.. మళ్లీ అదే రిక్షాలో ఇంటికి తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. మార్గమధ్యంలో ఓ వాహనం రిక్షాను ఢీకొంది. ఆ సమయంలో జ్యోతి తలకు స్వల్ప గాయమైంది. ఆమెకు చికిత్స అందించి సాయంగా నిలుస్తామని స్థానిక పోలీసులు హామీ ఇచ్చిన లోహార్ సున్నితంగా తిరస్కరించాడు. తన సతీమణి,



రిక్షాతో స్వస్థలానికి చేరుకున్నాడు. భార్య కోసం ఏకంగా 600 కిలో మీటర్లు రిక్షా తొక్కి తన ప్రేమను చాటుకున్నాడు లోహార్. వయసు శరీరానికే కానీ ప్రేమకు అడ్డుకాదని నిరూపించాడు. 'నాకంటూ ఉన్నది ఇద్దరే. ఒకరు నా భార్య, మరొక రిక్షా.'అని లోహార్ తెలిపారు.



## ప్రముఖ జర్నలిస్టు మార్క్ టుల్లీ కన్నుమూత

ప్రముఖ జర్నలిస్టు, రచయిత మార్క్ టుల్లీ (90) కన్నుమూశారు. 22 ఏళ్లపాటు ఆయన బీబీసీ దిల్లీ బ్యూరో చీఫ్‌గా పనిచేశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన. దిల్లీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మరో సీనియర్ జర్నలిస్టు, మార్క్‌కి సన్నిహిత మిత్రుడైన సతీష్ జాకబ్ ఈ విషయాన్ని 'పీటీఐ'తో ధ్రువీకరించారు. 1935 అక్టోబర్ 24న కలకత్తాలో (ప్రస్తుతం కోల్‌కతా) మార్క్‌టుల్లీ జన్మించారు. బీబీసీ రేడియో 4 కార్యక్రమం 'సమ్‌థింగ్ అండర్‌స్టూడ్'కు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భారత్‌పై రూపొందించిన అనేక డాక్యుమెంటరీలలో పాలుపంచుకున్నారు. ఈ సేవలకు గుర్తింపుగా 2002లో నైట్‌హుడ్ లభించింది. 1992లో పద్మశ్రీ, 2005లో పద్మభూషణ్ అందుకున్నారు. 'నో ఫుల్ స్టాప్స్ ఇన్ ఇండియా', 'ఇండియా ఇన్ స్లో మోషన్', 'ది హార్ట్ ఆఫ్ ఇండియా' వంటి అనేక పుస్తకాలు రాశారు.

## రవితేజ-శివ నిర్వాణ క్రేజీ కాంబో ఫిక్స్..

### హారర్ బ్యాక్‌డ్రాప్ మూవీ ఫస్ట్ లుక్‌కి టైం ఫిక్స్




**టాకీస్:** మాస్ మహారాజ రవితేజ నటించిన తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సంక్రాంతి కానుకగా ప్రేక్షకులను పలకరించిన విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత రవితేజ ఏ ప్రాజెక్ట్‌తో ముందుకు వెళ్లబోతున్నాడనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఆ క్రమంలోనే ఆయన నెక్స్ట్ మూవీపై అధికారిక ప్రకటన వెలువడింది. రవితేజ కెరీర్‌లో 77వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమాకు మజిలీ, ఖుషి చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వం వహించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయం ఏమిటంటే, ఈ చిత్రం హారర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

సాధారణంగా రొమాంటిక్, ఎమోషనల్ కథలతో గుర్తింపు పొందిన శివ నిర్వాణ, ఈసారి మాస్ మహారాజాతో కలిసి డిఫరెంట్ జానర్‌ను టచ్ చేయడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. రవితేజ ఎనర్జీకి హారర్ ఎలిమెంట్స్ కలిసితే ఎలాంటి అవుట్‌పుట్ వస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో నిర్మించనుండగా, సంగీత బాధ్యతలను జీవి ప్రకాష్ కుమార్ చేపట్టడం మరో హైలైట్‌గా మారింది. గతంలో అనేక విభిన్న చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన జీవి ప్రకాష్, ఈ హారర్ టచ్ ఉన్న కథకు ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు అందిస్తాడన్నదానిపై ఇప్పటికే అంచనాలు మొదలయ్యాయి.

ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. రవితేజ పుట్టినరోజైన జనవరి 26న, ఉదయం 10 గంటలకు ఆరం 77 ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ పోస్టర్‌తో సినిమా జానర్, కథా టోన్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.

## మమ్ముట్టి-మోహన్‌లాల్ 'పేట్రియాట్' నుంచి నయనతార ఫస్ట్ లుక్ రిలీజ్



**టాకీస్:** మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, మోహన్‌లాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ బహుభాషా చిత్రం 'పేట్రియాట్'. ప్రముఖ దర్శకుడు మహేష్ నారాయణన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ 'కల్నల్ రహీమ్ నాయక్'గా, మమ్ముట్టి 'డాక్టర్ డేనియల్ జేమ్స్'గా నటిస్తున్నారు. వీరిద్దరూ కలిసి ఒక అక్రమ ఆపరేషన్‌ను ఎలా అడ్డుకున్నారనేది కథాంశం. ఈ సినిమాలో ఫహద్ ఫాసిల్, కుంచాకో బోబన్, రేవతి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న నయనతార ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది.




## MOVIE TIME

## కోలీవుడ్‌లో మరో ఛాన్స్..

### సెన్సేషనల్ హీరోకి జోడీగా 'శ్రీలీల'

**టాకీస్:** అందం, అద్భుతమైన డ్యాన్స్‌తో టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించిన శ్రీలీల, ఇటీవల 'పరాశక్తి' సినిమాతో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. శివకార్తికేయన్ సరసన నటించిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలైనప్పటికీ, కథనంలో లోపాల వల్ల బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాన్ని అందుకుంది. దీంతో తమిళంలో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలన్న ఆమె ఆశలకు కొంత నిరాశ ఎదురైంది. అయితే, తాజా సమాచారం ప్రకారం యువ దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో శ్రీలీల మరో కథానాయికగా ఎంపికైనట్లు తెలుస్తోంది. టాలీవుడ్‌లో అతి తక్కువ కాలంలోనే తనదైన ముద్ర వేసిన నటి శ్రీలీల . కేవలం అందంతోనే కాకుండా, వెండితెరపై ఆమె చేసే డ్యాన్సులు, చలాకీతనం, అభినయం కుర్రకారును మంత్రముగ్ధులను చేస్తాయి. 'పెళ్లి సందడి' చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి, 'ధమాకా'తో మాస్ రాజా సరసన అదిరిపోయే స్టెప్పులేసి గ్లోబల్ స్థాయిలో పాపులర్ అయ్యారు. తెలుగులో టాప్ హీరోలందరి సరసన అవకాశాలు దక్కించుకుంటూ ఒకానొక సమయంలో 'బిజీయెస్ట్ హీరోయిన్'గా పేరు తెచ్చుకున్న శ్రీలీల కెరీర్ గ్రాఫ్ ప్రస్తుతం కాస్త ఒడిదుడుకులకు లోనవుతోంది.

**టాకీస్:** టాలీవుడ్ యూత్ స్టార్ విజయ్ దేవరకొండ మరోసారి ప్రేక్షకులను ఆశ్చర్యపరచే ప్రయత్నంలో ఉన్నాడు. ఈసారి అతను నేషనల్ క్రష్ రష్మిక మందన్నతో కలిసి ఓ భారీ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నాడు. 'టాక్సీవాలా'తో తనకంటూ ప్రత్యేకమైన స్టైల్‌ను నిరూపించిన దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండటంతో ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం 'ఎఆ14' అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ సాగుతుండగా, సోమవారం అధికారికంగా సినిమాకు సంబంధించిన టైటిల్‌తో పాటు ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన విజయ్ ఫస్ట్ లుక్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచింది.

ఈ చిత్రానికి 'రణబలి' అనే పవర్‌ఫుల్

## విజయ్ దేవరకొండ మూవీకి పవర్ ఫుల్ టైటిల్..



టైటిల్‌ను ఖరారు చేసినట్లు టాక్ వినిపిస్తోంది. కథా నేపథ్యం, థీమ్‌కు ఈ పేరు పర్ఫెక్ట్‌గా సరిపోతుందని మేకర్స్ భావిస్తున్నారట. బ్రిటీష్ పాలన కాలాన్ని బ్యాక్‌డ్రాప్‌గా తీసుకుని, 1854 నుంచి 1878 మధ్య జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా ఈ కథను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. విజయ్‌ను ఇంతకు ముందు చూడని విధంగా ఓ డిఫరెంట్ పీరియాడికల్ పాత్రలో చూపించనున్నారని, ఈ సినిమా ఫ్యాన్స్ ఆకలి తీరేలా ఉంటుందని దర్శకుడు రాహుల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు హైప్‌ను మరింత పెంచాయి.

'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్?రష్మిక జంట మూడోసారి తెరపై కనిపించనుండటంతో అభిమానులు ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను హిట్‌గా ఫిక్స్ చేసుకున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాతో పాటు, విజయ్ ప్రస్తుతం 'రౌడీ జనార్దన' వంటి ఇతర ప్రాజెక్టులతోనూ బిజీగా ఉండటం విశేషం. కొన్నాళ్లుగా విజయ్ దేవరకొండకి సరైన సక్సెస్ లేదు. మరి ఈ చిత్రాలలో ఏ మూవీ విజయ్‌కి లక్కీ మూవీగా మారుతుందో చూడాలి.

## ఓటీటీలోకి యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'పతంగ్'..

**టాకీస్:** సికింద్రాబాద్ బస్తీ నేపథ్యం మరియు గాలిపటాల పోటీల ఇతివృత్తంతో తెరకెక్కిన యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'పతంగ్' ఇప్పుడు ఓటీటీ విడుదలకు సిద్ధమవుతోంది. గతేడాది డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం, తనదైన శైలిలో ప్రేక్షకులను అలరించి ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో సందడి చేసేందుకు ముస్తాబవుతోంది. ప్రముఖ ఓటీటీ వేదిక సన్‌నెక్స్ట్ ఈ సినిమా డిజిటల్ హక్కులను దక్కించుకోగా.. జనవరి 30 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతుంది. ప్రముఖ నిర్మాత డి. సురేష్ బాబు సమర్పణలో ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ముక్కోణపు ప్రేమకథను వినోదాత్మకంగా వెండితెరపై ఆవిష్కరించింది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, వంశీ పూజిత్, ప్రణవ్ కౌశిక్ ప్రధాన పాత్రల్లో నటించగా, స్టార్ డైరెక్టర్ గౌతమ్ వాసుదేవ్ మీనన్ మరియు ఎస్.పి. చరణ్ కీలక పాత్రలు పోషించడం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. విస్కీ (వంశీ పూజిత్), అరుణ్ (ప్రణవ్ కౌశిక్) చిన్నప్పటి నుంచి ప్రాణ స్నేహితులు. దాదాపు 12 ఏళ్ల వీరి స్నేహంలోకి ఐశ్వర్య (ప్రీతి పగడాల) అనే అమ్మాయి ప్రవేశిస్తుంది. ఐశ్వర్య పట్ల ఇద్దరికీ ఇష్టం ఏర్పడడంతో వీరి స్నేహంలో చిన్నపాటి గ్యాప్ వస్తుంది. ఈ ముక్కోణపు ప్రేమకథకు ఒక స్పష్టమైన ముగింపుని ఇవ్వడం కోసం, హీరోలు ఇద్దరూ





పతంగుల పోటీని ఎంచుకుంటారు. మరి ఈ పోటీలో ఎవరు గెలిచారు? చివరికి ఐశ్వర్య ఎవరిని వరించింది? అనేదే ఈ సినిమా కథ.

## ఓటీటీలోకి 'ధురంధర్'..

**టాకీస్:** బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో సెన్సేషన్ సృష్టించిన రణ్‌వీర్ సింగ్ స్పై థ్రిల్లర్ 'ధురంధర్' ఇప్పుడు డిజిటల్ సందడికి సిద్ధమైనట్లు తెలుస్తుంది. గతేడాది డిసెంబర్ 5న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 1300 కోట్లకు పైగా వసూళ్లను సాధించి సరికొత్త చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. 'ఉరి' ఫేమ్ ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ యాక్షన్ డ్రామా రికార్డు కలెక్షన్లను సాధించింది. అయితే తాజాగా ఈ చిత్రం ఓటీటీలోకి రాబోతున్నట్లు తెలుస్తుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ 'నెట్‌ఫ్లిక్స్' ఈ సినిమా హక్కులను రికార్డు ధరకు దక్కించుకోగా.. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా జనవరి 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు బీ టౌన్ నుంచి వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతున్నట్లు తెలుస్తుంది. థియేటర్లలో కేవలం హిందీలో మాత్రమే విడుదలైన ఈ చిత్రం, ఓటీటీలో మాత్రం తెలుగు, తమిళం, కన్నడ మరియు మలయాళ భాషల్లో కూడా అందుబాటులోకి రాబోతున్నట్లు సమాచారం.

నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో రణ్‌వీర్ సింగ్ 'రా' ఏజెంట్‌గా పవర్‌ఫుల్ నటనను కనబరచగా, అక్షయ్ ఖన్నా, సంజయ్



దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి స్టార్స్ కీలక పాత్రల్లో మెరిశారు. పాకిస్థాన్‌లోని ప్రమాదకరమైన ల్యారీ ప్రాంతంలో సాగే అండర్ కవర్ ఆపరేషన్ నేపథ్యంలో ఈ సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ధురంధర్ 2' కూడా రూపొందుతోంది, అది మార్చి 19న థియేటర్లలో విడుదల కానుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.